www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గురువారం 15-08-2024 | విజయవాడ ప్రచురణ | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | సంపుటి : 73, సంచిక : 55 పేజీలు : 6+8, వెల: రూ.5.00

భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భంగా
అన్న క్యాంటీన్ల పునః ప్రారంభం

మొదటి విడతలో భాగంగా 100 అన్న క్యాంటీన్లు నేడే ప్రారంభం

రూ. 5 లకే అద్భుత భోజనం



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిచే
15 ఆగష్టు, 2024, మ. 12:30 గం.లకు, గుడివాడలో

సమాజమే దేవాలయం. ప్రజలే దేవుళ్ళు.
ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు అన్నార్తులకిచ్చే ఆహార వరాలు

జారీ చేసినవారు: డైరెక్టర్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

17 నెలలు జైల్లో ఉంటానని ఊహించలేదు

మనీశ్ సిసోడియా భావోద్వేగం



న్యూఢిల్లీ: సుదీర్ఘకాలం తాను జైలులో ఉంటానని అనుకోలేదని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా చెప్పారు. దిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై... ఇటీవల తీహార్ జైలు నుంచి విడుదలైనన సిసోడియా జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. గతేడాది ఫిబ్రవరిలో అరెస్ట్ అయిన సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో దాదాపు 17 నెలల అనంతరం ఆగస్టు 9న జైలు నుంచి బయటకు వచ్చారు. ఇంతకాలం తాను జైలులో ఉంటానని ఎప్పుడూ అనుకోలేదని సిసోడియా తెలిపారు. విచారణను పొడిగించాలనే ఉద్దేశంతోనే తనపై ఆరోపణలు చేశారని అన్నారు. కొన్ని నెలల ముందు తాను జైలుకు వెళతానని ఊహించలేదని తెలిపారు. 'రాజకీయాల్లో ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం మామూలే. కాబట్టి నాకు లోపల నుంచి నమ్మకం ఉండేది. ఒక వ్యక్తిని జైలుకు పంపడం లేదా అరెస్టు చేయడం వెనుక ఏదో ఒక కారణం ఉంటుందని భావించాను. సంస్కరణలు తీసుకురావాలి, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి, ప్రజలతో మమేకం అవ్వాలని క్రియాశీల రాజకీయాల్లోకి ఎవరైనా రావాలి అనుకున్నప్పుడు వారికి రెడ్ కార్పెట్ పరిచి స్వాగతం లభిస్తుందని ఆశించకూడదు. అదే విధంగా నేను కూడా మానసికంగా సిద్ధమయ్యాను' అని సిసోడియా అన్నారు. పీఎంఎల్ చట్టం కింద ఈడీ, సీబీఐ తనపై కేసులు పెట్టింది. ఈ చట్టం ప్రధానంగా ఉగ్రవాదులు, డ్రగ్స్ మాఫియాలకు నిధులు ఆపడానికి ఉద్దేశించింది. ఈ చట్టం ప్రకారం బెయిల్ సాధించడం కష్టం. అందుకే తనను చాలా కాలం జైలులో ఉంచడమే వారి ఏకైక లక్ష్యం. ముఖ్యంగా తన భార్య అనారోగ్యంతో ఉన్నప్పుడు తాను జైలులో ఉండటం తనకు, తన కుంటుబానికి ఇబ్బందిగా ఉండేది. అయితే తాను కృంగిపోకూడదని బలంగా నిశ్చయించుకున్నాను. జైలులో ఉన్నప్పుడు దాదాపు 15 నుంచి 16 గంటలు సెల్‌లో ఏకాంతంగా ఉండాల్సి ఉంటుంది. ఎవరితోనూ మాట్లాడటానికి అవకాశం ఉండదు. అందుకే తనతో తానే స్నేహం చేయడం అలవాటు చేసుకున్నానని సిసోడియా వివరించారు. దిల్లీ ప్రభుత్వంలో తిరిగి ఉపముఖ్యమంత్రిగా ఉండాలనుకుంటున్నారా అనే ప్రశ్నకు సిసోడియా స్పందిస్తూ... ప్రస్తుతానికి పార్టీ కోసం పని చేయడం గర్వంగా ఉందని, పరిపాలనలో భాగం కావడానికి తొందరపడటం లేదని అన్నారు. తాను జైలు నుంచి బయటకు వచ్చి నాలుగు రోజులైంది. సీఎం అరవింద్ కేజ్రీవాల్ త్వరలో తిరిగి వస్తారు. తాను పార్టీ కార్యక్రమాల్లో ఉండాలా లేదా ప్రభుత్వంలో ఉండాలా అని ముఖ్యమంత్రి, పార్టీ సీనియర్ నాయకత్వం నిర్ణయిస్తుందని తెలిపారు.

కశ్మీర్‌లో ప్రజాభద్రతపై రాజ్‌నాథ్ సమీక్ష



న్యూఢిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో పెరుగుతున్న ఉగ్రవాద ఘటనలపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం కీలక సమావేశం ఏర్పాటు చేశారు. రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమనే, జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ ధోవల్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ... భద్రతా సంస్థల అధిపతులు సౌత్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. దేశవ్యాప్తంగా గురువారం స్వాతంత్ర్య దినోత్సవం జరుగనున్న తరుణంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు, స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ప్రజాభద్రత కోసం జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు హైఅలర్ట్ ప్రకటించాయి. జమ్మూ ప్రాంతంలో ఉగ్రవాద ఘటనలు పెరుగుతుండడంతో బలగాలు కూంబింగ్ కొనసాగిస్తున్నాయి.

ఆప్‌లో చేరిన అకాలీదళ్ ఎమ్మెల్యే

చండీగఢ్: పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్ (ఎస్‌ఏడీ)కు ఎదురుదెబ్బ తగిలింది. రెండుసార్లు బంగా ఎమ్మెల్యేగా గెలిచిన ఆ పార్టీ నేత సుఖ్విందర్ కుమార్ సుఖీ బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సుఖీని పార్టీలోకి స్వాగతించారు. సుఖీ ఎల్లప్పుడూ అణగారిన వర్గాల సంక్షేమం కోసం పనిచేశారన్నారు. ఆయన రాకతో ఆప్ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఆప్ జాతీయ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వృత్తిరీత్యా వైద్యుడైన సుఖి, 2017లో తొలిసారి షాహిద్ భగత్‌సింగ్ (ఎస్‌బిఎస్) నగర్ జిల్లాలోని బంగా అసెంబ్లీ స్థానం నుంచి ఎస్‌ఏడీ తరపున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌ఏడీ టికెట్‌పై మళ్లీ శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. సుఖి పంజాబ్ విధానసభలో ఎస్‌ఏడీ లెజిస్లేటివ్ పార్టీ నాయకుడిగా ఉన్నారు. ఈ పరిణామం ఎస్‌ఏడీకి భారీ ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ప్రస్తుతం సుఖ్బీర్ బాదల్ గ్రూపు నుంచి ఎమ్మెల్యేగా గనీవే కౌర్ మజీతియా మాత్రమే మిగిలి ఉన్నారు. మూడవ అకాలీ ఎమ్మెల్యే మన్‌ప్రీత్ అయాలీ ఇప్పటికే అకాలీల తిరుగుబాటు గ్రూపులో ఉన్నారు.

పాఠ్యాంశాలుగా ఆర్‌ఎస్‌ఎస్ నేతల పుస్తకాలు

భోపాల్: ఆర్‌ఎస్‌ఎస్ నేతల పుసకాలను కాలేజీ పాఠ్యాంశాల్లో జోడించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలు గల రచయిత పుస్తకాలను కాలేజీ పాఠ్యాంశాలలో జోడించాలనే నిర్ణయం వెనుక కాషాయ పాలకుల కుట్ర స్పష్టమైందని కాంగ్రెస్ నేత కునాల్ చౌదరి మండిపడ్డారు. దేశంలో ప్రేమ సిద్ధాంతాన్ని మరుగునపరిచి విద్వేషం వ్యాప్తి చేయాలని బీజేపీ కోరుకుంటుందని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ నేతల పుస్తకాలను కాలేజీ పాఠ్యాంశాల్లో చేర్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మధ్యప్రదేశ్ మంత్రి విశ్వాస్ కైలాశ్ సారంగ్ స్వాగతించారు. దేశ సంస్కృతి బలోపేతానికి తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక కుటుంబాన్ని ప్రస్తుతించే క్రమంలో దేశ చరిత్రను కాంగ్రెస్ నిరంతరం దెబ్బతీస్తున్నదని ఆరోపించారు.

17 రాష్ట్రాలకు విస్తారంగా వర్షాలు

వాతావరణశాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ: రుతుపవనాలు చురుగ్గా విస్తరిస్తున్న క్రమంలో ఈ నెలలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దిల్లీ సహా 17 రాష్ట్రాలకు ఐఎండీ వర్ష సూచనలు జారీ చేసింది. ఇప్పటికే దిల్లీ చుట్టుపక్కల నగరాల్లో జోరు వాన కురిసింది. దిల్లీలో రేపు కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రానున్న 24 గంటల్లో దిల్లీ, చండీగఢ్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు, కర్నాటక, జమ్మూ కశ్మీర్, ఉత్తరాఖండ్, గుజరాత్‌లలో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కర్నాటక, కేరళ, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, జార్ఖండ్, అస్సోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, జమ్మ, హర్యానా, చత్తీస్‌గఢ్ , దిల్లీలో గురువారం భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు రాష్ట్రాల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది. దిల్లీలో ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీటిలో మునిగి ఇద్దరు చిన్నారులు, ఓ మహిళ మృతి చెందారు. అంతేకాకుండా, కేరళ, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరాఖండ్‌లలో కూడా పగటిపూట భారీ వర్షాలు కురుస్తాయని ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. పశ్చిమ హిమాలయ ప్రాంతంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని ఐఎండీ వెల్లడించింది. వాయువ్య భారతదేశంలోని మైదానాలలో విస్తృతమైన వర్షపాతం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 18 వరకు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో భారీ వర్షాలు పడతాయని ఐఎండీ అంచనా వేసింది. హర్యానాలో శుక్రవారం వరకు, జమ్మూ కశ్మీర్‌లో రాబోయే మూడు రోజులు వర్షాలు కురియనున్నట్లు వాతావరణశాఖ తెలిపింది.

అప్రమత్తంగా ఉండాలి

మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో గంగా, యమునా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో 30కి పైగా జిల్లాలు వరదల్లో మునిగిపోయాయి. గంగానది ఘాట్‌లు కూడా నీట మునిగాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాజస్థాన్‌లో వర్షాల కారణంగా మూడు రోజుల్లోనే 25 మందికి పైగా మరణించారు. ఇంకోవైపు కొండచరియలు విరిగిపడటంతో హిమాచల్ ప్రదేశ్‌లో 200కు పైగా రోడ్లు మూసుకుపోయాయి. గత నెల 27 నుంచి ఈ నెల 12 వరకు హిమాచల్‌లో రూ. 1000 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని, 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అక్కడి అధికారులు వెల్లడించారు.

వయనాడ్ బాధితులకు ఆర్థికసాయం

- మృతుల కుటుంబాలకు రూ.6లక్షలు
- గాయపడినవారికి రూ.50 నుంచి 75వేలు
- పినరయి విజయన్

తిరువనంతపురం: వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధితులకు కేరళ ముఖ్య మంత్రి పినరయి విజయన్‌ఆర్థికసాయం ప్రకటించారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.6 లక్షల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా బాధితులకు అద్దె సాయంగా రూ.6 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 'వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.6 లక్షల ఆర్థిక సాయం అందజేయనున్నాం. అదేవిధంగా బాధితులకు అద్దె సాయం కింద రూ.6 వేలు ఇవ్వనున్నాం. 60 శాతం గాయపడిన వారికి రూ.75 వేలు, 40 నుంచి 50 శాతం గాయపడిన వారికి రూ.50 వేలు అందజేస్తాం. తీవ్రంగా గాయపడిన వారికి అదనంగా రూ.50 వేలు సాయంగా అందజేస్తాం' అని సీఎం పినరయి విజయన్ వెల్లడించారు. మృతులకు కుటుంబాలకు అందించే రూ.6లక్షల్లో రూ.4 లక్షలు రాష్ట్ర విపత్తు సహాయ నిధి నుంచి, మిగిలిన మొత్తాన్ని ముఖ్యమంత్రి విపత్తు సహాయ నిధి (సీఎండీఆర్‌ఎఫ్) నుంచి అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే కొండచరియలు విరిగిపడి కళ్లు, అవయవాలు కోల్పోయిన వారికి లేదా 60 శాతం వరకు వైకల్యానికి గురైన వారికి సీఎండీఆర్‌ఎఫ్ నుంచి రూ.75 వేలు కేటాయిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా బాధితుల పునరావాసంలో భాగంగా అద్దె కింద నెలకు రూ.6వేలు అందజేస్తామని ఆయన చెప్పారు. అయితే అద్దె రహిత లేదా పూర్తి ప్రాయోజిత వసతి పొందే వారికి ఈ మొత్తం అందుబాటులో ఉండదని తెలిపారు. జూలై 30న వయనాడ్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో భారీ కొండచరియలు విరిగిపడిన ఘోర విపత్తులో ఇప్పటివరకు 231 మృతదేహాలు, 206 శరీర భాగాలు వెలికితీసినట్లు విజయన్ తెలిపారు. మొత్తం 401 మృతదేహాలు, శరీర భాగాల నమూనాలకు డీఎన్‌ఏ పరీక్షలు జరపగా... వాటిలో 349... 248 మంది వ్యక్తులకు (121 మంది పురుషులు, 127 మంది స్త్రీలు) చెందినవిగా తేలాయని వివరించారు. మెప్పాడి పంచాయతీలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను పరిశీలించేందుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీచే నియమించబడిన నేషనల్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్త జాన్ మత్తాయి నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం ఈ పని నిర్వహిస్తోందని విజయన్ వెల్లడించారు.

విపత్తు సంభవించిన ప్రాంతాల కింద ఏముందో, భవిష్యత్తులో అక్కడి భూమిని ఎలా ఉపయోగించవచ్చో తెలుసుకోవడానికి డ్రోన్ ఆధారిత సర్వే కూడా నిర్వహిస్తామని తెలిపారు. జులై 30న వయనాడ్‌తోపాటు కోజికోడ్ జిల్లాలోని విలంగాడ్‌లో కూడా అనేక కొండచరియలు విరిగిపడ్డాయని, అధికారులు అక్కడ జరిగిన విధ్వంసాన్ని పరిశీలించి... నష్టాన్ని అంచనా వేసిన తర్వాత ఆ ప్రాంతానికి కూడా ప్రత్యేక పునరావాస ప్యాకేజీని రూపొందిస్తామని విజయన్ చెప్పారు.

దోషుల్ని కాపాడుతున్నారా: రాహుల్

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన దోషులను శిక్షించకుండా కాపాడుతున్నారా అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. హేయమైన నేరానికి పాల్పడిన వారిని కాపాడేందుకు జరుగుతున్న ప్రయత్నాలతో సంబంధిత ఆసుపత్రి, స్థానిక యంత్రాంగంపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని ఆయన బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఈ పాశవిక చర్య మొత్తం దేశాన్ని షాక్‌కు గురిచేసింది. వైద్యులతో పాటు మహిళల్లో అభద్రతా భావాన్ని పెంచింది. వైద్య కళాశాలల్లోనే వైద్యులకు రక్షణ లేకపోతే, ఉన్నత చదువుల కోసం తమ కుమార్తెలను తల్లిదండ్రులు బయటకు ఎలా పంపగలరు? నిర్భయ ఘటన తర్వాత అమలులోకి వచ్చిన కఠిన చట్టాలు ఇటువంటి దురాగతాలను, హేయమైన నేరాలను ఎందుకు ఆపలేకపోతున్నాయి? హత్రాస్ నుంచి ఉన్నావో వరకు... కథువా నుంచి కోల్‌కతా వరకు మహిళలపై పెరుగుతున్న అకృత్యాల మీద నిర్ణయాత్మక చర్యలకుగాను సమాజంలో ప్రతి వర్గం, పార్టీ దృష్టి పెట్టడం, చర్చించడం అవసరం' అని రాహుల్ పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తానని, వారికి న్యాయం జరగాలన్నారు. సమాజానికి గుణపాఠం లభించేలా దోషులను శిక్షించాలని అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

హర్యానాలో కాంగ్రెస్‌కు పొత్తు అక్కర్లేదు

భూపిందర్ సింగ్ హుడా

న్యూఢిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయగలదని, ఆప్ సహా ఇతర పార్టీలతో పొత్తుల అవసరం ఉండదని మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలనే టికెట్లు వరిస్తాయని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. జాతీయ స్థాయిలో ఇండియా ఐక్య సంఘటన కొనసాగుతోం దని, రాష్ట్ర స్థాయిలో ఆప్‌తోగానీ మరే పార్టీతోగానీ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌కు లేదని, ఆ దిశగా చర్యలు కూడా జరగలేదని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. హర్యానాలో కాంగ్రెస్ సొంతంగా గెలవగలదని ధీమాగా చెప్పారు. దిల్లీ, హర్యానాలో ఆప్‌తో కాంగ్రెస్‌కు పొత్తు ఉండదని, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో మాత్రం 'ఇండియా' పోటీ చేస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా చెప్పడంతో హుడా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. హర్యానాలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అగ్నిపథ్‌ను వ్యతిరేకిస్తుందని, ఈ పథకాన్ని కేంద్రం రద్దు చేయాలని హుడా నొక్కిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ లభిస్తుందన్నారు. అలాగే వృద్ధాప్య పింఛన్ రూ.6వేలకు పెంచుతామని, పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని, 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితం చేస్తామని, 2లక్షల ఖాళీలను భర్తీ చేస్తామని మరోమారు హామీనిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలు మెరుగుపుతాయని, పెట్టుబడులు వస్తాయని, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఖ

100 మంది కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసులు

పనాజీ: రోడ్లు నాసిరకంగా నిర్మించడంపై గోవా ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. 100 మందికిపైగా కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రోడ్లపై గుంతల కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే... అందుకు ప్రభుత్వ ఇంజినీర్లే బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. సీఎం ప్రమోద్ సావంత్ బుధవారం ప్రజా పనుల విభాగం సీనియర్ అధికారులతో సమావేశమ య్యారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వినాయక చవితి పండగ నాటికి రోడ్లపై గుంతలు కనబడకుండా చేయాలని ఆదేశించారు. రోడ్లపై గుంతల వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే సంబంధిత ఇంజినీర్లపై చర్యలు తీసుకోవాలని పీడబ్ల్యూడీ సీనియర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇంజినీర్లతో పాటు 100 మందికి పైగా రోడ్డు కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సీఎం తెలిపారు. కాంట్రాక్టర్లు ప్రాధాన్యతల ప్రాతిపదికన గుంతలు పూడ్చాలన్నారు. ఈ పనులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక భారం మోయదని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లందరికీ అదనపు డబ్బు చెల్లించకుండా అక్టోబర్ తర్వాత రోడ్లు తిరిగి వేయాలని కోరనున్నట్లు తెలిపారు. వ్యవస్థ జవాబుదారీగా ఉండాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భద్రత కోసం అనేక కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు.

గుజరాత్ పోర్టులపై అదానీకి గుత్తాధిపత్యం

అదే మోదీ ప్రభుత్వ లక్ష్యం - జేపీసీతో విచారణ అత్యవసరం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: గుజరాత్ పోర్టు రంగంలో గుత్తాధిపత్యం కోసం అదానీ పోర్టులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. అదానీ వ్యవహారంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించడం అనివార్యమని బుధవారం మరోమారు నొక్కిచెప్పింది. 'మోదీ ఉన్నంత వరకు అదానీకి ఏదీ అసాధ్యం కాదు! అందుకోసమే జేపీసీతో విచారణ ముఖ్యం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. తన ప్రియతమ టెంపోవాలా (అదానీని ఉద్దేశించి) కోసం అవతార పురుషుడైన ప్రధాని మెరుపు వేగంతో పనిచేస్తారని ఎద్దేవా చేశారు. అదానీకి అన్ని రంగాల్లో గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపించారు. గుజరాత్ ప్రభుత్వం బిల్ట్-ఓన్-ఆపరేట్- ట్రాన్స్‌ఫర్ (బూట్) ఆధారంగా ప్రైవేటు పోర్టులకు 30ఏళ్ల రాయితీ కాలాన్ని మంజూరు చేసిందని తెలిపారు. 'బూట్' నమూనా ఆధారంగా ముద్రా, హజీరా, దహేజ్ పోర్టులపై అదానీ పోర్ట్స్ పెత్తనం కొనసాగుతోందన్నారు. 'రాయితీ కాలాన్ని మరో 45 ఏళ్ల నుంచి 75 ఏళ్లకు పొడిగించాలని లోక్‌సభ ఎన్నికలకు ముందు గుజరాత్ మారీటైమ్ బోర్డు (జీఎంబీ)ను అదానీ పోర్ట్స్ కోరింది. గరిష్ఠంగా 50ఏళ్లకే పరిమితి ఉంటుంది కానీ అదానీ కోసం దానిని సుసాధ్యం చేయాలని జీఎంబీ యత్నించింది. గుజరాత్ ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు హడావిడి చేసింది కానీ ఆ ఫైల్ వెనక్కు పంపబడింది' అని జైరాం రమేశ్ వెల్లడించారు. '30ఏళ్ల రాయితీ కాలాన్ని ప్రభుత్వం మంజూరు చేయగా తమ ప్రయోజనాలను పరిరక్షించాలని, ఇతర కంపెనీలు, ఆపరేటర్ల నుంచి బిడ్‌లు ఆహ్వానించాలి జీఎంబీ కోరింది. లేకపోతే అదానీతో ఆర్థిక షరతులపై మళ్లీ చర్చించాలని ప్రతిపాదించింది. దీంతో టెంపోవాలాకు పోటీ భయం పట్టుకున్నట్లు ఉంది... జీఎంబీ నిర్ణయం మార్చుకునేలా బలవంతం చేశారు. ఫలితంగా కొత్త బిడ్ల ఆహ్వానాలు, షరతులపై సమీక్షలు లేకుండా అదానీకి మార్గం సుగమమైంది. ఆ సంస్థకు అనుకూలంగా చర్యలను ముఖ్యమంత్రి సహా ఇతర అధికారులు చేపట్టడమే కాకుండా అవసరమైన అందరు భాగస్వాముల నుంచి అనుమతులు పొందారు. పట్టపగలే జరుగుతున్న ఈ దోపిడీ వల్ల గుజరాత్ పోర్టు రంగంపై అదానీ పోర్ట్స్ గుత్తాధిపత్యం... మార్కెట్‌లో పోటీ లేకపోవడం... సామాన్యులకు ధరాఘాతం వంటి పర్యవసానాలకు తోడు అదానీ పోర్ట్స్ విలువ పెంగడం, రుణ వ్యయం పడిపోవడం జరుగుతాయి' అని జైరాం రమేశ్ వెల్లడించారు. దీంతో పోటీ లేక బిడ్డింగ్ రాక గుజరాత్ ప్రభుత్వానికి ఆదాయం పడిపోతుందని, కోట్లల్లో నష్టం వస్తుందని ఆయన తెలిపారు. అంతేకాకుండా జార్ఖండ్‌లో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను బంగ్లాదేశ్‌కు అమ్ముకునేందుకు అదానీ సంస్థకు అనుమతులు ఉన్నట్లు విద్యుత్ శాఖ ద్వారా తెలిసిందని జైరాం రమేశ్ మరొక ట్వీట్‌లో పేర్కొన్నారు. 'జార్ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఆస్ట్రేలియా నుంచి బొగ్గును అదానీ సంస్థ దిగుమతి చేసుకుంటోంది. తయారు చేసిన విద్యుత్‌ను బంగ్లాదేశ్‌కు సరఫరా చేస్తోంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందం ద్వారా ఈ అనుమతులు పొందిన ఏకైక సంస్థ అదానీదే కావడం వివాదాస్పదమైంది. భారత్‌లోనే విద్యుత్‌ను విక్రయించేందుకు ఆ కంపెనీకి అనుమతి ఉన్నది' అని జైరాం రమేశ్ తెలిపారు.

పాఠశాలలోనే టీచర్ అత్యాచారయత్నం

బెంగళూరు: కర్నాటకలోని ఓ పాఠశాలలో దారుణం జరిగింది. విద్యార్థులకు మంచి బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు... చిన్నారుల పట్ల నీచంగా ప్రవర్తించాడు. తరగతి గదిలోనే 11 ఏళ్ల విద్యార్థినిపై అత్యాచారానికి యత్నించాడు. కలబురగి జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అలంద్ తాలూకాలోని నింబర్గా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో అయిదో తరగతి చదువుతున్న బాలికపై ఉపాధ్యాయుడు లైంగిక దాడికి యత్నించాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసి తరగతి గదికి వెళ్లిన సమయంలో ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో బాలిక తరగతి గదిలో ఒంటరిగా ఉంది. అరిస్తే చంపేస్తానంటూ బెదిరించి ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. అయితే బాలిక ధైర్యంగా పోరాడింది. సాయం కోసం గట్టిగా కేకలు వేయడంతో వెంటనే నిందితుడు పాఠశాల నుంచి పరారయ్యాడు. భయంతో ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు వెంటనే పాఠశాల ప్రిన్సిపల్‌ను కలిసి దీనిపై ప్రశ్నించారు. ఆ తరువాత తల్లిదండ్రులు నింబర్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఎంపీ బాన్సురీ స్వరాజ్‌కు దిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్‌కు దిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఎన్నికను సవాల్ చేస్తూ ఆప్ నేత సోమనాథ్ భారతి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ మన్‌మీత్ ప్రీతమ్ సింగ్ అరోడా 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ బాన్సురీకి నోటీసులు జారీ చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బాన్సురీ స్వరాజ్ న్యూదిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన విషయం తెలిసిందే. బాన్సురీ స్వరాజ్ కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ దివంగత నేత సుష్మా స్వరాజ్ కుమార్తె. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 80, 81 కింద దాఖలు చేసిన పిటిషన్‌లో స్వరాజ్, ఆమె ఎన్నికల ఏజెంట్, ఇతరులు అక్రమాలకు పాల్పడ్డారని సోమనాథ్ భారతి తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆప్ మాజీ మంత్రి, లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీ టికెట్‌పై పోటీ చేసిన రాజ్‌కుమార్ ఆనంద్ ఆప్ ఓట్లను చీల్చడం ద్వారా బాన్సురీకి సహకరించారని, ఆ తర్వాత జులై 10న ఆయన బీజేపీలో చేరిన విషయాన్ని ప్రస్తావించారు. సోమనాథ్ భారతి, బాన్సురీ స్వరాజ్ ఇద్దరూ న్యూదిల్లీ లోక్‌సభ సీటు నుంచి పోటీ చేశారు.

1037 పోలీసు గ్యాలెంట్రీ అవార్డులు

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 1037 పోలీస్ గ్యాలెంట్రీ అవార్డులను కేంద్రం ప్రకటించింది. పోలీసు, అగ్నిమాపక దళం, హోంగార్డ్‌తో పాటు పౌర రక్షణ (హెచ్‌జీ&సీడీ), కరెక్షనల్ సర్వీసెస్ సిబ్బందిని ఈ గ్యాలెంట్రీ అవార్డులతో సన్మానిస్తారు. ఇందులో ప్రెసిడెంట్స్ మెడల్ ఆఫ్ గ్యాలెంట్రీ (పీఎంజీ)తో పాటు 213 గ్యాలెంట్రీ పతకాలు, 94 విశిష్ట (డిస్టింగ్విష్) సేవలకు పతకాలు, 729 ప్రతిభ (మెరిటోరియస్ సర్వీసెస్) పతకాలు అందజేయనున్నట్లు కేంద్ర హోం వ్యవహారాల శాఖ (ఎంహెచ్‌ఏ) ప్రకటించింది. తెలంగాణకు చెందిన హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్యను ప్రెసిడెంట్స్ మెడల్ ఆఫ్ గ్యాలెంట్రీ వరించింది. 213 గ్యాలెంట్రీ పతకాల్లో 208 మెడల్స్‌ను పోలీసులకు అందజేస్తారు. 31 మంది జే&కే పోలీసులు, 17 మంది యూపీ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్‌కు చెందిన పోలీసులు కాగా మధ్యప్రదేశ్ నుంచి 12 మంది, జార్ఖండ్, పంజాబ్, తెలంగాణ నుంచి చెరో ఏడుగురితో పాటు 52 (సీఆర్‌పీఎఫ్), 14 (ఎస్‌ఎస్‌బీ), 10 (సీఐఎస్‌ఎఫ్), ఆరుగురు (బీఎస్‌ఎఫ్) సిబ్బందికి ఈ అవార్డులు అందనున్నాయి. అలాగే మూడు గ్యాలెంట్రీ పతకాల్లో ఒకటి చొప్పున దిల్లీ, జార్ఖండ్ అగ్నిమాపక దళం, యూపీ హెచ్& సీడీ సిబ్బంది అందుకోనున్నారు. 94 ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్ సర్వీస్ (పీఎస్ఎం)లో 75 పోలీసులకు, ఎనిమిది అగ్నిమాపక దళ సిబ్బందికి, పౌర రక్షణ, హోంగార్డ్ సిబ్బందికి, కరెక్షనల్ సర్వీస్ సిబ్బందిని మూడు పతకాలు వరించాయి. ఇక 729 మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్ఎం) పతకాల్లో 624 పోలీసులకు, 47 అగ్నిమాపక దళ సిబ్బందికి, 47 పౌర రక్షణ&హోంగార్డులు, 11 కరెక్షనల్ సర్వీస్ సిబ్బందికి అందనున్నట్లు ఎంహెచ్‌ఏ ప్రకటన తెలిపింది.

గురువారం
15-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 55
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆ బ్యాంకుల్లో 'కర్నాటక' ఖాతాలు బంద్

బెంగళూరు: కర్నాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో ఖాతాలను మూసివేయాలని సిద్దరామయ్య ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని శాఖలు, సంస్థలు, కార్పొరేషన్లు, బోర్డులు, స్థానిక సంస్థలు, వర్సిటీలు, ఇతర సంస్థలు తమ డిపాజిట్లు, పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కొత్త డిపాజిట్లు/ పెట్టుబడులు వద్దని సూచించింది. ఆయా బ్యాంకుల్లో ప్రభుత్వ నిధులతో అవకతవకలు, అనధికార లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో సిద్దరామయ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

కేజ్రీవాల్‌కు సుప్రీంలో దక్కని ఊరట

న్యూదిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన కేసుల్లో అరెస్టయిన దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు మళ్లీ సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. మద్యం కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అరెస్టుకు వ్యతిరేకంగా కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐకి నోటీసులు జారీ చేసింది. మద్యం విధానానికి సంబంధించి జూన్ చివర్లో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసిన సంగతి

- మిగతా 5 లో



త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

ప్రతిభ ఆధారంగానే ఎంపికలు

ఇంటింటా జాతీయజెండా ఎగరాలి

పార్టీ శ్రేణులతో సీఎం చంద్రబాబు

త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. బుధవారం పార్టీ గ్రామస్థాయి కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

5లో

నిఘా నీడన దిల్లీ

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

5లో

ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై

రంగంలోకి సీబీఐ

5లో

అది సామూహిక అత్యాచారం

జూనియర్ వైద్యురాలి ఘటనపై డా.గోస్వామి వెల్లడి

ఎన్‌కౌంటర్‌లో ఆర్మీ కెప్టెన్ మృతి

నలుగురు ఉగ్రవాదుల హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో బుధవారం భద్రతా సిబ్బంది, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 48వ రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఆర్మీ కెప్టెన్ దీపక్ సింగ్ అమరుడయ్యారు. మరోవైపు, ఈ ఎన్‌కౌంటర్ పరిసరాల్లో దొరికిన వస్తువుల ఆధారంగా నలుగురు ఉగ్రవాదులను కూడా మట్టుబెట్టినట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఉదంపూర్‌లో

- మిగతా 5 లో

ప్రాజెక్టుల భద్రతపై నీలినీడలు!

- డ్యామ్‌ల మరమ్మతులపై ప్రభుత్వాల శీతకన్ను
- కొట్టుకుపోతున్న గేట్లు... తుంగభద్ర ఘటనతో కలవరం
- సాగునీరు సముద్రంపాలు... ఖరీఫ్, రబీ ప్రశ్నార్థకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీ వర్షాలు, వరదల ఉధృతితో జలాశయాల గేట్లు కొట్టుకపోవడం, ప్రాజెక్టులు ధ్వంసమవుతున్న సంఘటనలు... ప్రజలను, రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. నిర్వహణ లోపం, మరమ్మతులు చేపట్టకపోవడంతో లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వృథాగా పోతోంది. భారీ వరద ఉధృతితో తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో... రాష్ట్రంలోని మిగిలిన ప్రాజెక్టుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల తుంగభద్ర డ్యామ్ 19వ గేటు ధ్వంసమై నీటిలో కొట్టుకుపోయిన ఘటన కర్నాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను కుదిపేసింది. ఈ గేటు పునరుద్ధరణకు పనులు చేస్తున్నప్పటికీ కొలిక్కిరాలేదు. రెండు రాష్ట్రాల ప్రభుత్వ యంత్రాంగం అక్కడ నానా తంటాలు పడుతోంది. డ్యామ్‌లోని నీటిని తొలగించాకే మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. తుంగభద్ర డ్యామ్ గేటు ధ్వంసానికి... తుంగభద్ర బోర్డు నిర్లక్ష్యమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్యామ్ నిర్మించి 71 ఏళ్లు

- మిగతా 5 లో



'విశాఖ ఉక్కు' పోరు ఉధృతం

22న సీఎండీ కార్యాలయం ముట్టడి

సెప్టెంబరులో రాస్తారోకోలతో ఆందోళన

పోరాట కమిటీ నేతల వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రజలు స్పష్టమైన మెజార్టీ ఇవ్వనప్పటికీ మిత్రపక్షాల దన్నుతో కేంద్రంలో మరోసారి అధికారం చేపట్టిన బీజేపీ... విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల మరింత కక్షపూరిత వైఖరితో వ్యవహరిస్తున్నదని విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు నిరసనగా పోరాట కార్యాచరణను ప్రకటించింది. ఈ నెల 22 న సీఎండీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలపాలని, సెప్టెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేయాలని నిర్ణయించింది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో రాష్ట్ర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, సీహెచ్ నర్సింగరావు , మంత్రి రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ... మంగళవారం జరిగిన పోరాట కమిటీ సమావేశంలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉధృతంగా పోరాడేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ప్రసక్తేలేదని, పూర్తి సామర్థ్యంతో పనిచేయించడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినప్పటికీ... గత నెలరోజుల నుంచి యాజమాన్యం మరింత దిగజారుడు చర్యలకు పూనుకుందని నేతలు మండిపడ్డారు. కేంద్రమంత్రి విశాఖ స్టీల్‌ప్లాంట్ సందర్శించి వెళ్లిన తర్వాత యాజమాన్యం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా నాశనం చేయాలనే దుర్బుద్ధితో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దీనిని ఎదుర్కోవడానికి పోరాటం కొనసాగించడం తప్ప

- మిగతా 5 లో

ఐరాసలో భారత రాయబారిగా హరీశ్

న్యూదిల్లీ: ఐఎఫ్‌ఎస్ అధికారి పర్వతనేని హరీశ్ న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితిలో భారత తదుపరి రాయబారి/ శాశ్వత ప్రతినిధిగా నియమితులయ్యారు. ఇది తెలుగు వ్యక్తికి లభించిన అరుదైన గౌరవం. 1990 క్యాడర్ ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన హరీశ్... ప్రస్తుతం జర్మనీలో భారత రాయబారిగా పనిచేస్తున్నారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 2021 నవంబర్ 6న జర్మనీలో భారత రాయబారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన... అప్పటి నుంచి ఆ పదవిలోనే కొనసాగుతున్నారు. అంతకముందు అనేక హోదాల్లో హరీశ్ పనిచేశారు. పర్వతనేని హరీశ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. గోల్డ్‌మెడల్ సాధించారు. ఆ తర్వాత ఆయన ఐఐఎం కలకత్తాలో విద్యనభ్యసించారు. ఆయనకు సతీమణి నందిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సెబీ అక్రమాలపై ఆందోళన

- త్వరలో కార్యాచరణ ప్రకటన
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వెల్లడి
- హసీనాకు ఆశ్రయం సరికాదని విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: అదానీ గ్రూపు కంపెనీల పెట్టుబడుల్లో సెబీ చైర్మన్‌కు వాటాలు ఉన్నాయనే ఆరోపణలపై తమపార్టీ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రకటించారు. ఆందోళనకు సంబంధించి త్వరలో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ హిండెన్‌బర్గ్ నివేదిక అంతర్జాతీయస్థాయిలో సంచలనం సృష్టిస్తోందని చెప్పారు. అదానీని అడుగడుగునా ప్రధాని మోదీ కాపాడుతున్నారని ఆరోపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సెబీ చైర్మన్ తన పదవికి రాజీనామా చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. శక్తిమంతమైన సెబీని మోదీ నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్‌ను, ఆర్‌బీఐను అలాగే చేశారని, న్యాయవ్యవస్థను కూడా మోదీ తన గుప్పెట్లో పెట్టుకుంటున్నారని, రాష్ట్రపతి వ్యవస్థ డమ్మీ అయిందని చెప్పారు. సెబీ వ్యవహారం, అదానీ అవినీతిపై దేశవ్యాప్తంగా ప్రదర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. బంగ్లాదేశ్ వ్యవహారంపై భారత్ వైఖరి సరికాదని నారాయణ అన్నారు. షేక్ హసీనాకు భారతదేశంలో ఆశ్రయం కల్పించడం ద్వారా బంగ్లాదేశ్ సంబంధాలు దెబ్బతింటాయన్నారు. హసీనా అహంకారంతో ప్రజాస్వామ్యాన్ని కాలరాశారని, బంగ్లాదేశ్‌లో అవినీతి విశృంఖలంగా పెరిగిందన్నారు. దీంతో గత ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరించాయని గుర్తుచేశాఎరు. హసీనా తండ్రి ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని ధ్వంసం చేయటాన్ని సీపీఐ ఖండిస్తున్నదన్నారు. బంగ్లాదేశ్ తాత్కాలిక పాలకుడిగా బాధ్యతలు చేపట్టిన యూనస్ మైక్రో ఫైనాన్స్‌కు ఆద్యుడని తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయంటూ గోరంతలు కొండంతలు చేసి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తూ లౌకిక వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయని విమర్శించారు. ఇందిరాగాంధీ తరహాలో బంగ్లాదేశ్‌పై మోదీ దాడి చేయాలనేది ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహంగా కనిపిస్తోందన్నారు. వాస్తవానికి బంగ్లాదేశ్‌లో హిందువులను విద్యార్థులు కాపాడుతున్నారని చెప్పారు. అంతర్జాతీయ విధాన సూత్రాలకు వ్యతిరేకంగా మోదీ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మోదీ అమెరికాలో ట్రంప్‌కు ప్రచారం చేస్తే బైడెన్ గెలిచారని, మారిషస్‌లో అడుగు పెడితే భారత్ వ్యతిరేకులు విజయం సాధించారని, బంగ్లాదేశ్‌లో హసీనాకు అండగా ఉంటే తిరుగుబాటు జరిగిందని, లక్ష్యదీప్‌ను పోటీకి పెట్టటంతో మాల్దీవులు మనకు వ్యతిరేకమైందని నారాయణ వివరించారు. సరిహద్దు దేశాల రాజకీయాల్లో జోక్యం చేసుకోవటంతో భారతదేశంపై వ్యతిరేకత పెరుగుతోందన్నారు. వయనాడ్ ప్రకృతి విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని నారాయణ డిమాండ్ చేశారు. మౌనమునిలా మోదీ పర్యటన సాగిందని ఎద్దేవా చేశారు. ఎల్-3 నిబంధనలకు అనుగుణంగా వయనాడ్

- మిగతా 5 లో

ఈడీ డైరెక్టర్‌గా రాహుల్ నవీన్

న్యూదిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పూర్తికాల డైరెక్టర్‌గా రాహుల్ నవీన్ నియమితులయ్యారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వ ప్రకటన బుధవారం వెలువడింది. ఆయన ఇప్పటివరకు ఆపద్ధర్మ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈడీ డైరెక్టర్‌గా నవీన్‌ను నియమించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది. తదుపరి ఉత్తర్వులు వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని అధికారిక ప్రకటన వెల్లడించింది. 1993 బ్యాచ్ ఐఆర్‌ఎస్ అధికారి

- మిగతా 5 లో

ఇదీ లోకం!

ఇలాంటి కార్యక్రమాలు బాగానే చేస్తారుగానీ, మనకు ఒలింపిక్స్‌లో పతకాలు ఎందుకు రాలేదు మోదీ తాతా!?

16 మంది ఐపీఎస్‌లకు మెమోలు

ఉదయం 10నుంచి సాయంత్రం వరకు డీజీపీ ఆఫీస్‌లో ఉండాలి

ద్వారకాతిరుమలరావు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీలో వెయిటింగ్‌లో ఉండి అందుబాటులో లేని 16 మంది సీనియర్ ఐపీఎస్‌లకు డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం మెమోలు జారీ చేశారు. వీరిని రోజూ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశించారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న డీజీ ర్యాంకు అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, సునీల్ కుమార్ సహా 16 మంది ఐపీఎస్ అధికారులకు మెమో జారీ అయ్యాయి. వెయిటింగ్‌లో ఉన్న సంజయ్, కాంతి రాణా టాటా, కొల్లి రఘురామిరెడ్డి, అమ్మిరెడ్డి, విజయరావు, విశాల్ గున్ని, రవిశంకర్ రెడ్డి, రిషాంత్ రెడ్డి, రఘువీరా రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, జాషువా, కృష్ణ కాంత్ పటేల్, పాలరాజులకు డీజీపీ మెమో జారీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు డీజీపీ ఆఫీసులోనే ఉండాలని ఆదేశించారు. విధులు ముగిశాక అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లాలని డీజీపీ స్పష్టం చేశారు.

పోలీస్ ఆర్గనైజేషన్ ఐజీగా రవికృష్ణ

సీనియర్ ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. కేంద్ర డిప్యుటేషన్ నుంచి ఏపీకి తిరిగొచ్చిన ఆయనకు నూతన బాధ్యతలు అప్పగించింది. పోలీస్ ఆర్గనైజేషన్ ఐజీగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్‌కు బాధ్యతలు చేపట్టాల్సిందిగా ఆదేశాలిచ్చింది. గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టేందుకు వీలుగా ఏపీలో యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తోంది.అనంతపురం జేసీగా డి.హరితకు ఇచ్చిన పోస్టింగ్‌ను ఏపీ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆమెను ఆదేశించింది. ఆమెకు పోస్టింగ్ ఇస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది.

జగన్ అక్రమాస్తుల కేసులో

కీలక పరిణామం

విచారణ నుంచి తప్పుకున్న సుప్రీం న్యాయమూర్తి సంజీవ్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుప్రీంకోర్టులో బుధవారం భారతీ సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్, ఎంపీ విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన కేసుల విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌కుమార్ ప్రకటించారు. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినప్పటికీ సీబీఐ కేసుల్లో తీర్పు తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పు ఇవ్వాలని 2022 నవంబర్‌లో తెలంగాణ హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ గత ఏడాది మే నెలలో ఈడీ

- మిగతా 5 లో

సంపాదకీయం

వయనాడ్‌కు దక్కింది సానుభూతే

తిప్పడు తిరుపతి వెళ్లనూ వెళ్లాడు తిరిగి రానూ వచ్చాడు అన్నది ఓ ముతక సామెత. కాని ఇది ఇటీవల తీవ్ర ప్రకృతి వైపరీత్యానికి గురైన కేరళలోని వయనాడ్‌లో ప్రధానమంత్రి మోదీ పర్యటనకు అతికినట్టుగా సరిపోతుంది. సాధారణంగా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలను తప్ప ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కుంటున్నా మోదీకి చీమ కుట్టినట్లయినా ఉండదు. కానీ ఎందుకో ఆయనకు వర్ష బీభత్సానికి గురైన వయనాడ్ ప్రజల బాధలపై సానుభూతి కలిగింది. దాదాపు 15 నెలల నుంచి అంతర్యుద్ధం లాంటి పరిస్థితి ఎదుర్కొంటున్న మణిపూర్ సందర్శించడానికి మోదీకి తీరిక చిక్కలేదు. కానీ వయనాడ్ ప్రజలపై ఏ కారణంవల్లో దయ కలిగింది. కేరళ శాసనసభ ఎన్నికలు జరగడానికి ఇంకా ఏడాదికి పైగానే సమయం ఉన్నా వర్ష బాధితులను పరామర్శించడానికి తీరిక చేసుకున్నారు. ఈ ఔదార్యానికి సంతోషించవలసిందే. చాలా ప్రాంతాలలో జరిగిన నష్టాన్ని ఆయన హెలికాప్టర్ నుంచే పరిశీలించారు. కానీ కొన్ని చోట్ల ప్రత్యక్షంగా నష్టాన్ని రెండున్నర గంటల పాటు గమనించారు. ఇది మహా విపత్తు అని రాని కన్నీటి బొట్లు కార్చారు. కానీ కేరళను ఆదుకోవడానికి మాత్రం ఇప్పటి దాకా ఆయనకు మనసు ఒప్పినట్టు లేదు. ఆర్థిక సహాయం మాట అలా ఉంచినా కేంద్ర మంత్రులు మాత్రం నోరారా కేరళ ప్రభుత్వాన్ని నిందించే పనిలో మునిగిపోయారు. అది మహా విపత్తు అని మోదీ వ్యాఖ్యానించడం, ఏ సహాయమూ అందించకుండా ఉండిపోవడం మోదీ బూటకాల్లో ఒకటి అయి ఉంటుందని మోదీ మంత్రివర్గ సభ్యులు భావిస్తున్నట్టున్నారు. అందుకే శాపనార్థాలు పెడ్తున్నారు. తమ వ్యాఖ్యల ద్వారా రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నారు. ఇది శవాలమీద చల్లే పేలాలు ఏరుకోవడం లాంటిదే. కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ మరీ బరితెగించి వయనాడ్ బాధితులు అందరూ అక్రమంగా నివాసం ఉంటున్న వారేనని నోటికొచ్చినట్టు మాట్లాడారు. వీరు ఆక్రమణలకు పాల్పడి ఆపదకొని తెచ్చుకున్నారు అని అన్నారు. దీనికి అమిత్ షా ఆడిన అబద్ధాలు ప్రేరణ కలిగించినట్టున్నాయి. బీభత్సమైన వర్షం కురుస్తుందని వాతావరణశాఖ హెచ్చరించినా కేరళ ప్రభుత్వం చలించలేదని అమిత్ షా సహజ ధోరణిలో అసత్య ఆరోపణలు చేశారు. కానీ అమిత్ షా మాటలు ఎంత తీవ్రమైన అబద్ధాలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రుజువులతో సహా నిరూపించిన తరవాత కానీ అమిత్ షా నోరు మూతపడలేదు. ప్రకృతి విలయానికి గురైన వయనాడ్‌ను సందర్శించినందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అభినందించడమూ వృథా అని తేలిపోయింది. వయనాడ్ విపత్తును ప్రధానమంత్రి మోదీ జాతీయ విపత్తుగా ప్రకటిస్తారన్న రాహుల్ ఆశ కూడా వమ్ము అయింది. సానుభూతి వచనాలు పలకడం తప్ప ఇప్పటి దాకా కేంద్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా విదిలించలేదు. జాతీయ విపత్తుగా ప్రకటిస్తే ఆ బాధ నివారించడానికి కేంద్రం తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించవలసి వస్తుంది. మోదీకి అది సుతరామూ ఇష్టంలేదు. కేంద్రం చేసిన సహాయమల్లా సహాయ కార్యకలాపాలు నిర్వహించడానికి సైన్యాన్ని, నౌకా దళాన్ని, వైమానిక దళాన్ని, జాతీయ విపత్తు నివారణా విభాగాన్ని రంగంలోకి దించడం మాత్రమే.

కేరళకు ఎదురైన విపత్తును జాతీయ విపత్తుగా పరిగణించాల్సిందేనని నిపుణులూ ఘోషించారు. ఇంత నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే ఎదుర్కోవడం సాధ్యం కాదని కూడా చెప్పారు. కనీసం దీన్ని తీవ్ర విపత్తుగానైనా కేంద్రం ప్రకటించవచ్చునని మరి కొందరు అంటున్నారు. అలా చేస్తే పార్లమెంటు ఉభయసభల సభ్యులు తమ స్థానిక అభివృద్ధి నిధుల నుంచి కొంతైనా వయనాడ్ పునరావాసానికి కేటాయించే అవకాశం ఉంటుంది. 2018లో కేరళలో వరదలు వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం దాన్ని తీవ్ర ఉపద్రవంగా ప్రకటించింది. ఇప్పుడు అదీ లేదు. కేరళ ప్రభుత్వం కోరుతున్నదల్లా వయనాడ్ ప్రజలకొచ్చిన కష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని మాత్రమే. ఇలా ప్రకటించడానికి చట్టం ఒప్పుకోదు అని సురేశ్ గోపి లాంటి కేంద్ర మంత్రులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. వయనాడ్ ఆపద లాంటివి చట్టాల మాటున దాక్కోవడానికి ఉపకరించకూడదు. కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన సహాయ, పునరావాస పథకం ప్రకటించాలని కోరుతోంది. బాధిత కుటుంబాల కోసం ఓ టౌన్‌షిప్ నిర్మించాలని కేరళ కోరుతోంది. వయనాడ్ లో వర్ష బీభత్సానికి గురైన ప్రాంతాలపై కేంద్ర మైనారిటీ వ్యవహారాల, మత్స్య, పశు సంవర్ధక శాఖమంత్రి జార్జ్ కురియన్ పంపిన నివేదిక ప్రధానమంత్రికి అందింది. అయినా ఉలుకూ పలుకూ లేదు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కేరళ ప్రభుత్వ అభ్యర్థనపై నివేదిక ఇవ్వడానికి తొమ్మిది మందితో ఓ కమిటీని నియమించింది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను పరిశీలిస్తారట. కేరళకు ఎదురైన ఆపదను మోదీ ప్రభుత్వం, కుటిల రాజకీయాలకు అలవాటు పడిన ఆయన మంత్రివర్గ సభ్యులు కేవలం సంకుచిత రాజకీయ హ్రస్వ దృష్టితోనే చూస్తున్నారు. ఇది మానవతా దృక్పథం బొత్తిగా లేకపోవడానికి చిహ్నం. ప్రతి అంశాన్నీ బీజేపీకి ఎన్నికలలో ఎలా ఉపయోగ పడ్తుంది అన్న దృష్టితోనే చూడడం అమానుషం. ప్రతిపక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలు ఈ దేశంలో భాగమని మోదీ కేవలం బీజేపీకి ప్రధానమంత్రి కాదని, దేశమంతటికీ ప్రధాని అన్న ఆలోచనే ఈ సంకుచిత జీవులకు ఎప్పటికైనా అర్థం అవుతుందన్న ఆశే లేదు. ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సానికి కొండచరియలు విరిగి పడినప్పుడు, రోడ్లకు అడ్డంకులు ఏర్పడడమే కాక కొన్ని రోడ్లు మాయమై పోయినప్పుడూ మోదీ, ఆయన వంది మాగధులు ఇలాగే వ్యవహరించారా! బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా ఇలాంటి పరిస్థితే ఏర్పడితే నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోతారా? అర్థం పర్థంలేని వితండ వాదానికే దిగుతారా? దేశంలో బీజేపీ ఓటర్లు మాత్రమే ఉండరు. జనం ఉంటారు. వారినందరినీ పట్టించుకోవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది మాత్రమే కాదు. కేంద్రానికి సంపూర్ణమైన బాధ్యత ఉంటుంది. వయనాడ్‌లో పర్యటించి ప్రజల విపత్కర పరిస్థితిని గమనించిన ప్రధానమంత్రి మోదీ కేరళ ప్రజలను ఆదుకోవడం దగ్గరకొచ్చే సరికి పిడికిలి మూసుకోవడం ఏ లెక్కకైనా సబబైంది కాదు. పైగా అది బాధ్యతా రాహిత్యం. పక్షపాత దృష్టి. అన్నింటినీ ఎన్నికలలో ప్రయోజనం కోణం నుంచే చూసే కొంచెపుతనం. వయనాడ్ నియోజక వర్గం నుంచి 2019లో రాహుల్ గాంధీ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో వయనాడ్ తో పాటు రాయబరేలీ నుంచి కూడా పోటీ చేసి రెండు చోట్లా నెగ్గారు. వయనాడ్ నియోజకవర్గాన్ని వదులుకున్నారు. అక్కడ బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే తప్ప మోదీ ప్రభుత్వం నాలుగు రాళ్లు విదిలించదేమో!

స్వాతంత్ర్య పరిరక్షణ మన కర్తవ్యం

డి. రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

బ్రిటీష్ వలసపాలకుల నుంచి స్వాతంత్ర్యం కోసం భారతదేశ ప్రజలు సుదీర్ఘపోరాటం జరిపారు. అనంతరమే 1947 ఆగస్టు 15వ తేదీన దేశం స్వాతంత్ర్యం పొందింది. స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు గొప్ప పాత్రను నిర్వహించారు. 20వ శతాబ్దం రెండవ దశాబ్దిలో దేశ వ్యాప్తంగా దేశభక్తియుత యువకులు, మేధావులు, పోరాటానికి అంకితమైన సమూహం ఒక్కటయ్యారు. 1920లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ)ని స్థాపించడం ఒక పెద్ద విజయం. ఈ సంఘం ద్వారా ప్రగతిశీల జాతీయ భావాలు కలిగిన నాయకులు కార్మికవర్గాన్ని ఏకం చేశారు. బ్రిటీష్ పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలను ఏఐటీయూసీ సవాలుచేసింది. దీర్ఘకాలిక రాజకీయ డిమాండ్ల సాధనకు కార్మికులకు రాజకీయ పరిజ్ఞానం కల్పించింది. అలాగే స్వాతంత్ర్య సాధన లక్ష్యాన్ని బోధించింది. ఈ తరుణంలోనే రెండవ ప్రపంచయుద్ధం ముగియవచ్చింది. అప్పుడు ప్రపంచవ్యాప్తంగానూ, దేశంలోనూ గణనీయమైన మధనం జరుగుతోంది. రష్యాలో గొప్ప పోరాటయోధుడు లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ విప్లవం విజయవంతమైంది. ఇదే సమయంలో భారతదేశ రాజకీయ రంగంలోకి మహాత్మాగాంధీ ప్రవేశించారు. స్వాతంత్ర ఉద్యమ అజెండాలో గొప్ప మార్పు తీసుకువచ్చే బాధ్యతను కమ్యూనిస్టులు చేపట్టారు. భారతజాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సీ)లోనూ, వెలుపల గణనీయమైన అజెండా మార్పు విజయవంతంగా జరిగింది.

కాన్పూర్‌లో 1925 డిసెంబరు 26న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) స్థాపన జరిగింది. భారతదేశమంతటా కమ్యూనిస్టులు ఒక తాటిపైకి వచ్చారు. ప్రగతిశీలమైన డిమాండ్లను చేసేందుకు శక్తివంతమైన వేదిక ఏర్పడింది. ఈ డిమాండ్లు స్వాతంత్ర్యపోరాటంలో భాగమయ్యాయి. సీపీఐ కాన్పూర్ మహాసభలో ఆహ్వానకమిటీ చైర్మన్‌గా మౌలానా హస్రత్ మోహాని చైర్మన్‌గా బాధ్యత వహించారు. బ్రిటీష్ పాలకుల నుంచి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఈ మహాసభ మొదటిసారిగా డిమాండ్ చేసింది. అంతక్రితం పరిమిత స్వయంప్రతిపత్తి డిమాండ్ ఉన్నది. దాని నుంచి గణనీయమైన సంపూర్ణ స్వాతంత్ర పోరాటం జరపాలని నిర్ణయం జరిగింది. దేశంలో రాజ్యాంగ అసెంబ్లీ ఏర్పాటు డిమాండ్‌ను మొదట కమ్యూనిస్టులే చేశారు.

1936లో ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) నెలకొల్పి రైతులను సమీకరించడంలో సీపీఐ ముందు పీఠిన నిలిచింది. 1936లోనే విద్యార్థుల సమస్యలపై పోరాడేందుకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్), రచయితలు, మేధావులను సమీకరించేందుకు ప్రగతిశీల రచయితల సంఘం, కళాకారుల కోసం ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్(ఇప్టా)ను 1943లో స్థాపించారు.

స్వాతంత్ర పోరాటంలో భాగస్వాములైన కమ్యూనిస్టులకు పెరుగుతున్న ఆదరణవల్ల వారు చేస్తున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు బ్రిటీష్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. అయితే ప్రజల నుంచి కమ్యూనిస్టులకు లభిస్తున్న ఆదరణ కారణంగా అణచివేతకు చేసిన ప్రయత్నంలో వలస పాలకులు

విఫలమయ్యారు. ఈ పోరాటాలన్నీ కలిసి ఉన్నత స్థాయికి చేరాయి. అప్పుడు "స్వాతంత్రానికి ఇది చివరి పోరాటం" అని పిలిచారు. 1946లో భారత నావికుల తిరుగుబాటు జరిగింది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని సీపీఐ మద్దతుతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో 'అజాద్ హింద్ ఫౌజ్'ను ఏర్పాటుచేశారు. నౌకా సిబ్బంది తమపైన బ్రిటీష్ సిబ్బంది జారీ చేసే ఉత్తర్వులను ధిక్కరించారు. బ్రిటీష్ పాలకులు చేసిన హింసాకాండను తిప్పికొట్టారు. భారతదేశంలో తమ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని విదేశీ పాలకులు గుర్తించారు. విదేశీ పాలనను ఎంతమాత్రం అంగీకరించబోమని ప్రజలు హెచ్చరించారు.

సమాజాన్ని అధ్యయనంచేసి అణగారిన వర్గాలను సమీకరించి భవిష్యత్తులో పోరాటం చేయాలన్న అజెండాను సీపీఐ నిర్ధారించుకున్నది. పరిశ్రమలలోనూ, వ్యవసాయరంగంలోనూ జరుగుతున్న దోపిడీ స్వభావాన్ని సీపీఐ ప్రజలకు వివరించి వారిని సమీకరించింది. అమానవీయ అంటరానితనం ఆచరించడాన్ని కాన్పూర్ మహాసభలో ఎం.సింగారవేలు చెట్టియార్ తీవ్రంగా వ్యతిరేకించారు. కుల వ్యవస్థను వ్యతిరేకించిన వారిలో సీపీఐ ముందున్నది. మార్క్సిజం,శాస్త్రీయ భావజాలాన్ని సంతరించుకున్న సీపీఐ సామాజిక సంస్కరణలకు ఎంతగానో దోహదంచేసింది. మహిళలను సమీకరించి పితృస్వామ్యానికి వ్యతిరేకంగా సీపీఐ ముందుగా పోరాటాన్ని సాధించింది. భారతదేశంలో స్వేచ్ఛ, సమసమాజం భావనను సీపీఐ విస్తరింపచేసింది. వర్గ, కుల, వారసత్వాలు, పితృస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేసేందుకు లక్షలాదిమంది ప్రజలను సీపీఐ సమీకరించింది. సమాజంలో న్యాయం, సమానత్వంకోసం పోరాటం నిర్వహించింది.

దేశ స్వాతంత్ర్యం లభించి దాదాపు ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నది. ఇదే సమయంలో మన పార్టీ శతవార్షికోత్సవాలను జరుపుకోనున్నాం. సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో పౌరులందరినీ భాగస్వాములనుచేసి సామాజిక న్యాయాన్ని సాధించేందుకు, కులరహిత దేశం కోసం మనం కలలుకన్న వర్గరహిత సమాజం కోసం గొప్ప విలువలను కాపాడుకునేందుకు రాజీలేని పోరాటాన్ని కొనసాగించే సవాళ్లు మన ముందున్నాయి. ఇందుకోసం ప్రజలను సమీకరించేందుకు వారికి చేరువ కావాలి.

సీపీఐ స్థాపించిన 1925లోనే ఆర్ఎస్ఎస్ కూడా ఏర్పడింది. ఈ సంస్థ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడేబదులు దేశంలో మైనారిటీలను, కమ్యూనిస్టులను తమ శత్రువులుగా భావించారు. శతాబ్దికాలంగా ప్రజానుకూల విలువలను నాశనం చేశారు. కమ్యూనిస్టులు స్వాతంత్ర్య పోరాటంలో గొప్ప త్యాగాలు చేయగా, ఆర్ఎస్ఎస్ దాని నాయకత్వం బ్రిటీష్ పాలకులకు సేవకులుగా పనిచేశారు. ఆర్ఎస్ఎస్ దేశంలో రాజకీయ వాతావరణాన్ని విషతుల్యంచేసి మహాత్మాగాంధీని కాల్చి చంపడానికి దోహదంచేసింది. ఈ దుర్మార్గానికి ఒడిగట్టినందున ఆనాటి హోం శాఖ మంత్రి వల్లభాయ్ పటేల్ ఆర్ఎస్ఎస్‌ను నిషేధించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ఆర్ఎస్ఎస్‌పై నిషేధాన్ని తొలగించారు. రహస్యంగా మతాధిపతుల పాలన సాగించే హిందురాష్ట్రను ఏర్పాటుచేసే లక్ష్యంకోసం పనిచేస్తున్నారు. ఆర్ఎస్ఎస్‌కి అనేక అనుబంధ సంస్థలున్నాయి. ఇవన్నీ ప్రజాధీనంలో పుట్టగొడుగుల్లాగా ఏర్పడి పనిచేస్తున్నాయి. వీటన్నింటినీ కలిపి సంఘ్‌పరివార్ అంటున్నాం. కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ ఆర్ఎస్ఎస్ ఆయుధమే. ఈ పార్టీ కూడా కులతత్వం, దోపిడీ స్వభావం కల దుష్ట భావజాలాన్ని అనుసరిస్తున్నది. ఈ భావజాలాన్నే సవాలుచేస్తూ సీపీఐ ప్రగతిశీల, సోషలిస్టు అజెండాకోసం పోరాటం చేయవలసి ఉంది. దేశంలో అత్యంత ముఖ్యమైన అంశం ఈ సవాలును అధిగమించేందుకు పోరాడాలి. బ్రిటీష్ పాలకులపైన గొప్ప పోరాటంచేసిన చరిత్ర మనకుంది. అలాగే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేందుకు మన పోరాటం గణనీయంగా దోహదంచేసింది. అదొక అవశేషంగా మిగిలిపోయేలా ఉండకూడదు. దీన్ని నిలుపుకునేందుకు మరింత బలమైన పోరాటం చేయాలి. దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మన పోరాటం ఉంటుంది. ఆర్ఎస్ఎస్-బీజేపీ దుష్పరిపాలనలో మన ప్రజలు నలిగిపోతున్నారు. విచ్ఛిన్నకర మత భావజాలం మన సమాజాన్ని చీల్చేందుకు వెనుకాడటంలేదు. అందువల్ల మనం ప్రజలకు దగ్గరకావడానికి వారి నిత్యజీవితంలో మనం భాగస్వాములం కావాలి. ఇది స్వల్పమైన లక్ష్యమేమీ కాదు. ఆర్ఎస్ఎస్-బీజేపీ అధికారం చేజిక్కించుకున్నాయి. ఆర్ఎస్ఎస్ ప్రభుత్వ యంత్రాంగంలోనూ, ప్రభుత్వంలోని అన్ని విభాగాలలోనూ చొరబడింది. మన సెక్యులర్, ప్రజాస్వామ్య రిపబ్లిక్‌కు తీవ్ర ముప్పుగా ఏర్పడింది. హిందూ రాష్ట్ర స్థాపనను లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ విపత్తు జరగకముందే మనం దేశ స్వాతంత్ర్యాన్ని, సెక్యులర్ ప్రజస్వామ్య రిపబ్లిక్‌ను కాపాడుకోవాలని డాక్టర్ అంబేద్కర్ ఎప్పుడో హెచ్చరించారు. గొప్ప స్వాతంత్ర్య ఉద్యమం వారసత్వంగా లభించిన గొప్ప విలువలను పరిరక్షించుకునేందుకు నిత్యం జాగరూకతతో ఉండాలి. దేశంలో తక్షణ డిమాండ్ల కోసమే కాక సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి పార్టీ తీవ్ర పోరాటాలను, ప్రచారాన్ని కొనసాగించాలి.

విదేశీ గడ్డపై భారత పతాకం ఎగురవేసిన మేడం కామా



మొట్ట మొదట భారత పతాకాన్ని కోల్‌కత లోని పర్సీ బగాన్ స్క్వేర్ (గ్రీన్ పార్క్) లో 1907 ఆగస్టు 7న ఎగురవేశారు. కానీ విదేశీ గడ్డపై తొలిసారిగా భారత పతాకాన్ని ఎగురవేసింది మాత్రం భికైజీ కామా. ఆమె 1907 ఆగస్టు 22న పారిస్‌లో తోటి విప్లవకారులతో కలిసి ఆవిష్కరించారు. కానీ ఈ ఆవిష్కరణ 1905లోనే జరిగిందన్న వాదనలూ ఉన్నాయి. ఈ పతాకాన్ని బెర్లిన్ లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్ట్ మహాసభలో ప్రదర్శించారు కూడా. ఈ పతాకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా భారత్‌లో సమానత్వం, స్వయం నిర్ణయాధికారం కావాలని ఆమె కోరారు. ఆమెను మేడం కామా అంటారు. కోల్‌కతా లో 1906 ఆగస్టు ఏడున ఆవిష్కరించిన పతాకం ఇప్పటి జాతీయ పతాకానికి భిన్నంగా ఉండేది. దాని మీద అడ్డంగా ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగులు ఉండేవి. మధ్యలో "వందేమాతరం" అన్న అక్షరాలు ఉండేవి. మేడం కామా జర్మనీలో తొలిసారి భారత పతాకాన్ని ఆవిష్కరించి నప్పుడు భారత స్వాతంత్ర్యోద్యమాన్ని సమర్థించాలని అమెరికాకు విజ్ఞప్తి చేశారు. భికైజీ కామా కోల్‌కతాలో 1861లో సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించారు. విద్యార్థిగా ఆమె తెలివైంది, క్రమశిక్షణ కలిగింది, భాషల అధ్యయనం మీద ఆసక్తి ఉన్న వ్యక్తి అన్న పేరు ఉండేది. ఆ తరువాత వెంటనే ప్లేగు వ్యాధి వచ్చింది. 1896 అక్టోబర్‌లో బొంబాయి ప్రెసిడెన్సీలో మొదట విపరీతమైన కాటకం ఆ తర్వాత వెంటనే ప్లేగు వ్యాధి వచ్చిన పీడితులను ఆదుకోవడానికి వైద్య కళాశాల ఆర్థిక

ఒకే ఒక్కడు

సహాయం అందజేసింది. అనేక బృందాలు ప్లేగు వ్యాధి సోకిన వారికి పని చేసేవి. కామా అలాంటి ఒక బృందంలో చేరి ప్లేగు సోకిన వారికి సేవ చేశారు. ఈ క్రమంలో ఆమెకు కూడా ప్లేగు సోకింది. కానీ ప్రాణాలు కాపాడుకోగలిగారు. ప్లేగు సోకిన వారికి సహాయం కోసం ఆర్థిక వనరులు అందజేసిన వైద్య కళాశాలే ఆ తరవాత హాఫ్కిన్ ప్లేగు టీకా పరిశోధనా కేంద్రంగా మారింది. కోల్‌కతాలో ఎగురవేసిన భారత పతాకానికి, పారిస్‌లో కామా ఆవిష్కరించిన పతాకానికి స్వల్ప తేడాలు ఉన్నాయి. ప్రస్తుత జాతీయ పతాకానికి స్ఫూర్తి నిచ్చింది కామా ఆవిష్కరించిన పతాకమే స్ఫూర్తి అంటారు. 1905లో కామా పారిస్ వెళ్లి అక్కడ ఎస్.ఆర్. రాణా, ముంచెష బుర్జోర్జి గోద్రెస్ తో కలిసి 'పారిస్ ఇండియన్ సొసైటీ' స్థాపించారు. ప్రవాస జీవితం గడుపుతున్న అనేక మందితో కలిసి కామా పనిచేసేవారు. నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్ నుంచి ఆమె స్వాతంత్ర్యోద్యమానికి మద్దతుగా విప్లవ సాహిత్యం పంపిణీ చేసేవారు. వందేమాతరం గేయాన్ని కూడా ప్రచారంలో పెట్టేవారు. మదన్‌లాల్ ధీంగ్రాను కాల్చి చంపినందుకు నిరసనగా మదన్ తల్వార్లు (కత్తులు) కూడా పంపిణీ చేసేవారు. కామా రూపొందించే వారపత్రికలు, ఇతర విప్లవకర సాహిత్యాన్ని అప్పుడు ఫ్రాన్స్ వలస ప్రాంతంగా ఉన్న పుదుచ్చేరి ద్వారా భారత్‌లోకి ప్రవేశ పెట్టేవారు. కామా లాంటి వారు విదేశీ గడ్డ మీంచి భారత స్వాతంత్ర్యంకోసం చేసిన కృషి అమెరికాలోని ఆఫ్రికా రచయితలకు, డబ్ల్యు. ఇ.బి. డు బోయిస్ లాంటి వారికి ప్రేరణగా ఉండేదంటారు. ఆయన 1928లో రాసిన నవల "డార్క్ ప్రిన్సెస్" ఇతివృత్తం భారత స్వాతంత్ర్య పోరాటమేనంటారు. భికైజీ కామా స్త్రీ పురుష సమానత్వంకోసం పాటు పడేవారు. 1910లో ఈజిప్ట్ లోని కైరోలో మాట్లాడుతూ "ఇక్కడ ఈజిప్టు ప్రతినిధుల్లో సగం మంది ఉన్నారు అన్నారు. మిగతా సగం మంది ఎక్కడున్నారు? మీ తల్లులు, అప్ప చెల్లెళ్లు ఎక్కడ ఉన్నారు? మీ భార్యలు, కూతుర్లు ఎక్కడ?" అని ప్రశ్నించారు. అంటే ఆమె స్త్రీల ప్రాతినిధ్యం కోసం అపేక్షించారు. 1885లో ఆమె రుస్తుంజీ కామాను పెళ్లాడారు. ఆయన న్యాయవాది. బ్రిటీష్ వారికి అనుకూలురు. కామా ఉద్యమాల్లో పాల్గొనడం ఆయనకు నచ్చలేదు. వాళ్లిద్దరి మధ్య పొసగక పోవడం, ఆరోగ్యం బాగుండక పోవడంతో ఆమె లండన్ వెళ్లాల్సి వచ్చింది. లండన్‌లోనే ఆమెకు దాదాభాయ్ నౌరోజీతో పరిచయం అయింది. ఆయన సిద్ధాంతం బాగా ఆకట్టుకుంది. అందువల్లే స్వాతంత్ర్య ఉద్యమంలోకి దూకారు. అక్కడే ఆమె శ్యాం లాల్ వర్మ, లాల హర్దయాళ్ లాంటి వారిని కలుసుకున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో కీలకమైన వ్యక్తిగా మారారు. ఆమె అమెరికాలో పర్యటించి భారత్‌లో బ్రిటీష్ పాలన దుష్పరిణామాలను వివరిస్తూ ప్రసంగించేవారు. "చూడండి స్వతంత్ర భారత పతాకం అవత రించింది. ఇది స్వాతంత్ర్యంకోసం పోరాడిన యువత రక్తంతో రూపొందింది. వారి గౌరవార్థం ఈ పతాకం ఉద్భవించింది. వారి పేర భారత స్వాతంత్ర్య సమరాన్ని మీరందరూ సమర్థించాలని కోరుతున్నాను" అనే వారు. "భారత్ స్వతంత్రం కావాలి. గణతంత్రం కావాలి. భారత్ సమైక్యంగా ఉండాలి" అని గర్జించేవారు. లండన్ నుంచి ఆమె స్వదేశానికి తిరిగి రావాలనుకున్నప్పుడు తాను భారత్ తిరిగి వెళ్తే జాతీయోద్యమంలో పాల్గొనబోనని వాగ్దానం చేయాలి అన్న షరతు పెట్టారు. కాని ఆమె ఈ షరతును నిరాకరించారు. ఆమెకు స్త్రీ పురుష సమానత్వంపై అమితమైన ఆకాంక్ష ఉండేది. కాని 1920లో హెరాబాయ్, మిథన్ టాటాను కలుసుకున్నప్పుడు వారు మహిళలకు ఓటు హక్కు ఉండాలని మాట్లాడారు. ఈ ఇద్దరు పార్సీ మహిళలతో అంగీకరిస్తూనే ముందు భారత్‌కు స్వాతంత్ర్యం కావాలి అని ఖండితంగా చెప్పారు. స్వాతంత్ర్యంవస్తే భారత మహిళలకు ఓటు హక్కుతో సహా సర్వ హక్కులు వస్తాయని విశ్వసించారు.1935 దాకా ఆమె ప్రవాస జీవితమే గడిపారు. కానీ తీవ్రంగా జబ్బు పడడంవల్ల, పక్షవాతం సోకడంవల్ల ఎలాగైనా స్వదేశం తిరిగి రావాలను కున్నారు. సర్ కొవాస్జీ జెహంగీర్ ద్వారా బ్రిటీష్ పాలకులకు అభ్యర్థన పంపించారు. స్వదేశం తిరిగి రావాలన్న ఆకాంక్ష బలంగా ఉన్నందువల్ల 1935 జూన్ 24న పారిస్ నుంచి బ్రిటీష్ ప్రభుత్వానికి రాసిన లేఖలో తాను స్వదేశం తిరిగి వెళ్తే రాజద్రోహ కార్యకలాపాలకు పాల్పడను అని హామీ ఇచ్చారు. 1935 నవంబర్ లో స్వదేశం తిరిగి వచ్చారు. తొమ్మిది నెలల తరవాత 74వ ఏట 1936లో మరణించారు.

- అనన్య వర్మ

స్వాతంత్ర్య దినం - మోదీ వికసిత భారతం


డి.వి.వి.ఎస్. వర్మ

మోదీ "వికసిత భారత్" నినాదం కొత్తది కాదు. మోదీ రోజూ పాడుతున్న పాటే. ఇప్పుడు దానిని కొత్త మాటగా పైకి తీశారు. ఈ అగస్టు 15 న జరుపుకునే 78వ స్వాతంత్ర్యదిన వేడుకలకు "వికసిత భారత్"ను థీమ్‌గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యగానంతో జరిగే స్వాతంత్ర్య వేడుకలతో ఈ నినాదానికి పునః ప్రాణ ప్రతిష్ట చెయ్యాలన్నది మోదీ లక్ష్యంగా కనిపిస్తున్నది. మోదీ మానస పుత్రికగా రూపుదిద్దుకున్న "వికసిత భారత్" కల సాకారం కావడం ఒక ఏడాదిలోనో ఐదేళ్లలోనో జరిగేది కాదు. దాని పూర్ణ దర్శనం 2047లో మనకి చూపిస్తామంటున్నారు. అప్పటి వరకూ తానే వుంటానని, ఇది దైవకార్యమనీ దానిని సాధించడానికే తాను దైవదూతగా వచ్చినట్లు గత ఎన్నికల నాడే ప్రకటించారు. ఈ స్వాతంత్ర్య వేడుకలతో ఈ మహత్తర దైవకార్యానికి ఆయన శ్రీకారం చుట్టబోయే దృశ్యాన్ని దేశ ప్రజలకు చూపించ తలచినట్లు కనిపిస్తున్నది. మోదీ దగ్గర ఒక "అద్భుతమైన కళ" వుంది. అది దృష్టి మళ్లింపు కళ. ప్రజలు తమ నిత్యజీవన సమస్యల మీద దృష్టి పెట్టకుండా దారి మళ్లించే కళ. గత పది సంవత్సరాలపాలన మీద మోదీ మాట్లాడరు. ఎందుకంటే అది అత్యధిక ప్రజల జీవితాలను మెరుగు పర్చలేదు పైగా దుర్భరం చేసింది. ప్రస్తుత ప్రజల తక్షణ సమస్యల మీద మాట్లాడరు. ఎందుకంటే వాటిని ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించే మార్గాలు ఆయన వద్ద లేవు. అందుకే 2047లో సాకారమయ్యే దూరపు కొండలను చూపించి ప్రజల్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. 2024-25 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ "వికసిత భారత్ " ను సాధించే రోడ్ మ్యాప్‌లో 9 ప్రాధాన్యతా అంశాలను ప్రకటించారు. బడ్జెట్ ప్రసంగాలలో మాటల గారడీలు, అంకెల గారడీలు వుంటాయి. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి 500 భారీ కంపెనీలు 1 కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ కల్పించడం ఘనకార్యంగా కనిపిస్తోంది. ఇది 5 సంవత్సరాల పథకం. ప్రస్తుతానికి కేటాయించింది



కేవలం 10000 కోట్లు మాత్రమే. మరొకటి ఆంధ్ర ప్రదేశ్ రాజధానికి 15000 కోట్లు సహాయం అందించే ప్రకటన వాస్తవానికి అప్పుగా సమకూర్చడం. దీనికి బడ్జెట్‌లో కేటాయింపులు వుండవు. ఇలా మాటలు కోటలు దాటితే చేతలు గడప దాటని ప్రకటనలు చాలా కనిపిస్తాయి. పైగా బడ్జెట్‌లో ప్రాధాన్యతాంశాలుగా ప్రకటించిన వాటిలో నిజమైన సమస్యలను పక్కన పెట్టారు. వికసిత భారత్‌లో వ్యవసాయం ప్రాధాన్యత గల అంశం. కాని వ్యవసాయ ఉత్పత్తులకు లాభసాటి ధర కావాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి దానికి చట్టబద్ధత కల్పించాలన్న రైతుల డిమాండ్‌ను ఈ బడ్జెట్ పక్కన పెట్టింది. నిరుద్యోగ సమస్య సెగ గత ఎన్నికల్లో బీజేపీకి తగిలింది. ఈ బడ్జెట్‌లో దానికి కొన్ని పథకాలను ప్రకటించారు. బడా కంపెనీల ఇంటర్న్‌షిప్ పథకం అనేది పని నేర్పడం కోసం కాదు, ప్రభుత్వ సొమ్ముతో యజమానులు వారితో పని చేయించు కోవడం అన్నది బహిరంగ రహస్యం. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా రిటైర్ అయిన ఉద్యోగుల ఖాళీలు భర్తీ చెయ్యకుండా ఇంటర్న్‌లను వాడుకోవడం జరుగుతుంది. వ్యవసాయ రంగానికి, గ్రామీణ పరిశ్రమలకు కేటాయింపులు గణనీయంగా పెంచకుండా అక్కడ 55 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నది కేవలం ప్రకటనగానే మిగిలిపోతుంది. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు పెంచకుండా మానవాభివృద్ధిపై చెప్పిన మాటలు నీటిమూటలుగానే వుంటాయి. మాటల్లో సామాజిక న్యాయం తప్ప ఆచరణలో అదనపు సాయంలేదు. నిత్యావసరాలపై జీఎస్టీ మోతతో పెరిగిన ధరలతో సతమతమౌతున్న సామాన్యుల జీవన భారాన్ని తగ్గించే ప్రస్తావన లేదు. ఇదీ మోదీ బడ్జెట్ ద్వారా మనకి రుచి చూపించిన "వికసిత భారత్" ప్రపంచంలో అత్యధిక జీడీపీ (స్థూల జాతీయ ఉత్పత్తి) గల దేశాల్లో మనం 5వ స్థానంలో వున్న మాట నిజమే. మన దేశం త్వరలోనే జపాన్, జర్మనీని అధిగమించి మూడవ స్థానానికి చేరుకుంటా మనేది అంకెల్లో నిజం కావచ్చును. జపాన్, జర్మనీ జనాభా రీత్యా, వైశాల్యం రీత్యా చాలా చిన్న దేశాలు. వాటి జీడీపీని అధిగమించడం గొప్ప ఘనకార్యం మాత్రం కాదు. మొదటి స్థానంలో వున్న అమెరికా జీడీపీ 29000 బిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం 85 వేల డాలర్లు, రెండవ స్థానంలో వున్న చైనా జీడీపీ 18000 బిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం 13000 డాలర్లు, ప్రస్తుత భారత్ జీడీపీ 3,942 బిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం 2730 డాలర్లు. మూడో స్థానంలోకి వచ్చినా జీడీపీలో, తలసరి ఆదాయంలో ఎంతో దిగువలోనే వుంటాం. యూఎన్‌డీపీ ప్రపంచ మానవాభివృద్ధి సూచీలో మనం 134 వ స్థానంలో, ఆకలి సూచీలో 121 స్థానంలో వున్నాం. మోదీ ప్రభుత్వమే దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నది. నిరుద్యోగం మునుపెన్నడూలేని స్థాయికి చేరుకుంది. గత 10 సంవత్సరాలుగా మోదీ దేశ ప్రజల్ని "సబ్ కా సాథ్ సబ్ కా వికాస్" నినాదంతో మురిపించారు. "సబ్ కా వికాస్" లో రైతులు, యువత, పేదలు మాత్రంలేరు. కార్పొరేట్లు, బిలియనీర్లు ఇబ్బడి ముబ్బడిగా వికసించారు. కేవలం 169 మంది బిలియనీర్ల దగ్గర 78 లక్షల కోట్ల సంపద పోగుపడింది. 10 శాతం కుబేరుల దగ్గర 78 శాతం దేశ సంపద గుట్టపడింది. మొత్తం మీద మోదీ పాలన కార్పొరేట్ల చేత కార్పొరేట్ల కోసం సాగుతున్న పాలన అయింది. కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు తమ తమ బడ్జెట్‌ల పరిధిలో అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ముందుకు సాగించలేని స్థితికి చేరుకున్నాయి. ప్రత్యక్ష పన్నులు ఇప్పటికే తారాస్థాయిలో వున్నాయి. అదనపు పన్నులను ప్రజలు భరించే స్థితి లేదు. ఇప్పటికే అన్ని ప్రభుత్వాలు అప్పుల కుప్పలుగా మారాయి. వాటిమీద వడ్డీల చెల్లింపులకే అవి సతమత మౌతున్నాయి. రాబోయే కాలం సంక్షేమాన్ని పెంచేది కాదు, కత్తెరలు వేసేకాలం. మోదీ ప్రభుత్వం దేశ సంపదను దోచుకున్న కార్పొరేట్లపై పన్నులు వేసే ప్రభుత్వం కాదు. ఈ పదేళ్ల మోదీ ప్రభుత్వం గతంలో వున్న 35 శాతం కార్పొరేట్ పన్నును 22 శాతానికి తగ్గించింది. వారికి 20 లక్షల కోట్ల బాకీలను రద్దు చేసింది. 10 శాతం వున్న వారసత్వ పన్నును తొల గించింది. సంపద పన్ను ప్రస్తావనే లేదు. ఇవి జరగాలంటే ప్రత్యామ్నాయ రాజకీయం కావాలి. దేశంలో 10 శాతంగా వున్న కుబేరుల మీద కార్పొరేట్ పన్ను పెంచడం, సంపద పన్ను, వారసత్వ పన్ను విధిం చడం ద్వారా 20 లక్షల కోట్లకు మించి అదనపు ఆదాయం వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ మూడు పన్నుల ద్వారా కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపదను పునఃపంపిణీ చేయడంతోనే శ్రమజీవులకు, పేదలకు మౌలిక ఆదాయాన్ని, హక్కుగా మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు, నివాస వసతులను ఉచితంగా కల్పించవచ్చును. స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు చట్టబద్ధంగా వ్యవసాయ పంటలన్నింటికీ లాభసాటి ధరలు అందించ వచ్చును. వేతన జీవులకు, ఉద్యోగులకు ఆదాయ పన్ను మినహాయింపు గణనీయంగా పెంచవచ్చును. దీనికి కార్పొరేట్లను కట్టడిచేసే విధానాలు కావాలి. మోదీ భారతంలో కార్పొరేట్‌లు వికసిస్తారు, జనజీవనం వికసించదు. "వికసిత భారత్" వంటి శుష్క నినాదాలు శూన్య హస్తాలే తప్ప స్వాతంత్ర్య ఫలాలు ప్రజలకు దక్కవు.

దారి దీపం సంపాదకులు
సెల్: 8500678977

బెల్గొరోడ్‌లో అత్యవసర పరిస్థితి

ఉక్రెయిన్ సేనల దూకుడుతో గవర్నరు ప్రకటన

మాస్కో: రష్యా భూభాగంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. తాజాగా కర్స్క్ ప్రాంతంలో ఇప్పటికే 1,000 చదరపు కిలోమీటర్లను ఆక్రమించిన ఉక్రెయిన్ సేనలు తాజాగా మరో ప్రాంతంపై దృష్టిపెట్టాయి. సరిహద్దుల్లోని బెల్గొరోడ్‌పై దాడులు మొదలుపెట్టాయి. దీంతో ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితి విధించినట్లు అక్కడి గవర్నర్ వ్యాచెస్లావ్ గ్లాడ్కోవ్ ప్రకటించారు. ఈ మేరకు టెలిగ్రాంలో వీడియో సందేశం ప్రచురించారు. దేశంలో ఫెడరల్ ఎమర్జెన్సీ విధించాలని తాము కోరుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఉక్రెయిన్ సేనలు ముందుకువస్తుండటంతో ఇప్పటికే ఇక్కడ అనేక ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయిస్తున్నట్లు తెలిపారు. గతవారం ఉక్రెయిన్ సేనలు వ్యూహం మార్చి రష్యా భూభాగంలో ఎదురుదాడులు

మొదలుపెట్టాయి. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఇతర దేశాల సైన్యం రష్యా భూభాగంలోకి చొరబడటం ఇదే తొలిసారి. ఇక బెల్గొరోడ్ ప్రాంతంలో షెబికినో నగరం, ఉస్టింకా గ్రామాలపై కీవ్ సేనలు డ్రోన్ దాడులు జరిపాయి. మరోవైపు కర్స్క్ రీజియన్‌లో తాము డజన్లకొద్దీ డ్రోన్లు కూల్చేసినట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. వొరొనెజ్ ప్రాంతంలో మొత్తం 35 డ్రోన్లు కూల్చేసినట్లు ఆ ప్రాంత గవర్నర్ వెల్లడించారు. ఇప్పటికే రష్యా భూభాగంలోకి ప్రవేశించిన ఉక్రెయిన్ సైన్యం కర్స్క్ రీజియన్‌లో దాదాపు 1000 చదరపు కిలోమీటర్ల మేర భూభాగాన్ని తమ అధీనంలోకి తీసుకొందని ఆ దేశ సైనిక కమాండర్ జనరల్ ఒలెక్సాండర్ సిర్‌స్కీ వెల్లడించారు. మరోవైపు... రష్యాలోకి తమ సేనలు అడుగుపెట్టినట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ ధ్రువీకరించారు. అందుకుగాను తమ సైనిక సిబ్బందిని అభినందించారు. ఆ ప్రాంతంలో మానవతా సహాయం అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉక్రెయిన్ సేనలతో సాగుతున్న భీకర పోరులో మాస్కో విజయం సాధిస్తుందని పుతిన్ ధీమా వ్యక్తంచేశారు. భవిష్యత్తులో యుద్ధం ముగింపునకు సంబంధించిన చర్చల్లో మెరుగైన స్థితిలో ఉండేందుకే ఆ దేశం ఈ చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

థాయ్‌లాండ్ ప్రధానిపై వేటు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటు న్నాయి. నైతిక ఉల్లంఘనలకు పాల్పడ్డారనే అభియోగాలపై ఆ దేశ ప్రధాన మంత్రి స్రెట్టా థావిసిన్‌ను రాజ్యాంగ న్యాయస్థానం పదవి నుంచి తొలగించింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. కొత్త ప్రధానమంత్రి నియామకానికి పార్లమెంటు ఆమోదం పొందేంత వరకు ఆపద్ధర్మ పద్ధతిలో ప్రస్తుత కేబినెట్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. అయితే, ఎప్పటిలోగా ప్రధాని పదవి భర్తీ చేయాలనే విషయంపై ఎటువంటి కాల పరిమితి విధించలేదు. ఓ న్యాయమూర్తికి లంచం ఇవ్వడానికి యత్నించిన కేసులో జైలు శిక్ష అనుభవించిన కేబినెట్ సభ్యుడి నియామకానికి సంబంధించిన వ్యవహారంలో ప్రధానమంత్రిపై న్యాయస్థానం వేటు వేసింది. ప్రతిపక్ష పార్టీని రద్దు చేయాలని కోర్టు ఆదేశించిన కొన్ని రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పిచిత్ చుయెన్‌బాన్‌ను మంత్రి వర్గంలోకి ప్రధాని స్రెట్టా తీసుకున్నారు. 2008లో ఓ కేసుకు సంబంధించి న్యాయమూర్తికి లంచం ఇవ్వడానికి ప్రయత్నించిన కేసులో ఆరు నెలలపాటు జైలు శిక్ష అనుభవించిన మంత్రిపై తీవ్ర విమర్శలు రావడంతో ఆ పదవి నుంచి వైదొలిగారు. జైలు శిక్ష పూర్తి చేసుకున్నప్పటికీ సుప్రీం కోర్టు ఆయనను నిజాయతీ లేని వ్యక్తిగా పేర్కొంటూ తీర్పు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించింది. ప్రధానమంత్రిగా తన కేబినెట్ సభ్యుడి అర్హతలు పరిశీలించాల్సిన పూర్తి బాధ్యత స్రెట్టాదేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. పిచిత్ గతం గురించి తెలిసినప్పటికీ ఆయనను కేబినెట్‌లోకి ప్రధాని తీసుకున్నారని, ఇది నైతిక ఉల్లంఘనలకు పాల్పడటమేనని పేర్కొంది.

త్వరలో జపాన్ ప్రధాని రాజీనామా

టోక్యో: తాను సెప్టెంబర్‌లో పదవి నుంచి వైదొలగనున్నట్లు జపాన్ ప్రధాని ఫుమియో కిషిద బుధవారం ప్రకటించారు. టోక్యోలో ఆయన మీడియాతో మాట్లాడు తూ కొత్తవారికి నాయకత్వం అప్పగించాల్సి న సమయం ఆసన్నమైందన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో తాను పోటీ చేయబోవడం లేదని ఆయన వెల్లడించారు. దీంతో ఆయన దేశ ప్రధాని పదవి నుంచి దిగిపోయి... వేరొకరికి పీఠం అప్పగించను న్నట్లు తేలింది. కొత్త నాయకుడికి తన పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని ప్రకటిం చారు. 'ఈ ఎన్నికల్లో ప్రజలకు ఎల్‌డీపీ (లిబరల్ డెమోక్రటిక్ పార్టీ) మారిందని, ఇప్పుడున్నది సరికొత్త పార్టీ అని తెలియ జేయాలి. ఇందుకోసం పారదర్శకంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలి. అన్ని వర్గాలను సంప్రదించడం చాలా ముఖ్యం. పార్టీ మారిందని చెప్పే క్రమంలో నేను పగ్గాలు వేరేవారికి అప్పగించడం చాలా ముఖ్యం. వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీచేయడం లేదు' అని కిషిద చెప్పారు. ఆయన ఇప్పటికే తన మనసులోని మాటను ప్రభుత్వ సీనియర్ అధికారులకు చేరవేశారు. 2021లో నాటి జపాన్ ప్రధానమంత్రి యోషిహిడే సుగా బాధ్యతలు చేపట్టి ఏడాది గడవకముందే పదవి నుంచి తప్పుకోను న్నట్లు ప్రకటించారు. మరోసారి ఈ బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా లేనని తెలిపారు. అంతకుముందు ఏడాదిలో ప్రజాదరణ కోల్పోయిన నేతగా మిగిలిన సుగా... కొత్త నాయకుడిని ఎన్నుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. నాడు ఆయన అనూహ్య ప్రకటన పార్టీతో పాటు జపాన్ రాజకీయాల్లో అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ నేపథ్యంలోనే అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) తమ నూతన నాయకుడిని ఎన్నుకునేందుకు సంస్థాగత ఎన్నికలు నిర్వహించింది. ఇందులో కొంతమంది ఎల్‌డీపీ నేతలు పోటీలో నిలిచినప్పటికీ ఫ్యుమియో కిషిదాకు పార్టీలో భారీ మద్దతు లభించింది. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కిషద నేతృత్వంలో ఎల్‌డీపీ విజ యం సాధించింది. దిగువ సభలో మొత్తం 465 స్థానాలు ఉండగా... అధికార ఎల్‌డీపీ 261 స్థానాల్లో విజయం సాధించింది.

ఎన్‌కౌంటర్‌లో ఆర్మీ కెప్టెన్ మృతి

(మూడోపేజీ తరువాయి)

ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో భద్రతా సిబ్బంది ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం గాలింపు చేపట్టిన భద్రతా దళాలపై తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. సిబ్బంది ఎదురుకాల్పులు జరపడంతో సాయుధులు దోడా జిల్లాలోని అడవుల్లోకి పారిపోయారు. దీంతో నిన్న రాత్రి నుంచి కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ క్రమంలోనే శివ్‌గఢ్-అస్సార్ బెల్ట్‌లో భద్రతా సిబ్బంది గాలింపు చేస్తుండగా నదీ ప్రాంతంలో నక్కిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆర్మీ కెప్టెన్ తీవ్రంగా గాయపడగా... ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన కన్నుమూసినట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు. మరోవైపు, ఈ ఆపరేషన్‌లో నలుగురు ఉగ్రవాదులను హతమార్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఘటనాస్థలంలో అత్యాధునిక ఎం4 రైఫిల్, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు రక్తంతో తడిసిన నాలుగు బ్యాక్‌ప్యాక్‌లను గుర్తించారు.

కేజ్రీవాల్‌కు సుప్రీంలో దక్కని ఊరట

(మూడోపేజీ తరువాయి)

తెలిసిందే. అప్పటినుంచి ఆయన సీబీఐ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ అరెస్టును సవాల్ చేస్తూ తొలుత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా... అక్కడ ఊరట లభించలేదు. అరెస్టు చట్టబద్ధమేనంటూ హైకోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం... ఈ కేసులో సీఎంకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. తదుపరి విచారణను ఆగస్టు 23వ తేదీకి వాయిదా వేసింది.

ఈడీ డైరెక్టర్‌గా రాహుల్ నవీన్

(మూడోపేజీ తరువాయి)

నవీన్ (57) 2019 నవంబరులో ఈడీ ప్రత్యేక డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గతేడాది సెప్టెంబరులో ఆపద్ధర్మ డైరెక్టర్ అయ్యారు. ఢిల్లీ, జార్ఖండ్ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ అరెస్టుల వంటి కేసులు ఈయన అధ్వర్యంలోనే సాగాయి. ఈడీ డైరెక్టర్‌గా సంజయ్ కుమర్ మిశ్రా పదవీ కాలాన్ని పదేపదే పొడిగించడాన్ని చట్టవిరుద్ధమంటూ సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టడంతో రాహుల్ నవీన్‌కు ఈడీ బాధ్యతలను కేంద్రం కట్టబెట్టిన విషయం విదితమే.

త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. బుధవారం పార్టీ గ్రామస్థాయి కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీ విజయం కోసం కృషి చేసిన పార్టీ నేతల సేవలను మర్చిపోలేమని, త్వరలోనే ప్రతిభ ఆధారంగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని, దీనిపై ఇప్పటికే కసరత్తు జరుగుతోందని తెలిపారు. ఆన్‌లైన్‌తో పాటు అన్ని సచివాలయాల్లోనూ ఇసుక బుక్ చేసుకునే సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. అభివృద్ధి అజెండాగా అధికారాన్ని కొనసాగించుకుంటూ రాష్ట్రాన్ని దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలబెట్టుకోవచ్చని సూచించారు. మళ్లీ గెలవాలంటే ఎన్నికైన ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాష్ట్రవ్యాప్తంగా వంద పట్టణాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించబోతున్నాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. 16,347 పోస్టులతో డీఎస్సీ నిర్వహణకు ముందడుగు వేశాం. దేశంలోనే మొదటిసారి నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టాం. ప్రజలకు ఉచిత ఇసుకను అందిస్తున్నాం. ఇప్పటికి 60 రోజుల పాలన పూర్తయ్యింది. రాష్ట్రం అన్ని రకాల సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున, వాటి పరిష్కారంపై ఎక్కువ దృష్టి పెట్టాం. హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఇంటింటా జాతీయ జెండా ఎగరాలి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. జాతీయ జెండా రూపకర్త మన తెలుగువారైన పింగళి వెంకయ్య. ఇది తెలుగుజాతికి గర్వకారణం. దేశానికి స్వాతంత్ర్యం అనంతరం అంచలంచలుగా దేశాన్ని నాయకులు అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు...దాన్ని కొనసాగించడంతోపాటు మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు.

ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్‌లపై సమీక్ష

ఐటీ,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్,ఆర్టీజీఎస్‌లపై సీఎం బుధవారం సాయంత్రం సచివాలయంలో సమీక్షించారు. ఈసమావేశంలో ఆ శాఖలకు సంబంధించిన రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఐటీ శాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్, సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, ఏపీ ఫైబర్ నెట్ ఎండీ దినేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు' పోరు ఉధృతం

(మూడోపేజీ తరువాయి)

మరోమార్గం లేదని కమిటీ భావించిందని వెల్లడించారు. గత ఐదేళ్లుగా ఒక్క కార్మికుడిని కూడా విశాఖ స్టీల్ యాజమాన్యం కొత్తగా ఉద్యోగంలోకి తీసుకోలేదని, 5వేలకు పైగా కార్మికులు, ఆఫీసర్లు రిటైర్ అయ్యారని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులలో 30శాతం మందిని, పర్మినెంట్ కార్మికులను వీఆర్‌ఎస్ పేరుతో మరో 3వేల మందిని తొలగించాలని ప్రభుత్వం వ్యూహరచన చేసిందన్నారు. వీఆర్‌ఎస్ ఇవ్వడానికి రూ.1400కోట్లు కేటాయించారని, మరోవైపు ముడి ఇనుపఖనిజం కొనుగోలు చేయడానికి డబ్బులు లేవనే సాకుతో ఉత్పత్తి తగ్గిస్తున్నారని చెప్పారు. ఉత్పత్తిని పెంచడానికి కొత్తగా కార్మికులను నియమించుకోవాల్సిందిపోయి తగ్గిస్తున్నారన్నారు. గత నెలరోజుల్లో కార్మికులకు, అధికారులకు ఉన్న అనేక హక్కులను, అధికారులకిచ్చే పీఆర్‌పీని, కార్మికులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను నిలిపివేయాలని నిర్ణయించారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులలో 30శాతం మందిని తగ్గించాలని హెచ్‌ఓడీలకు ఆదేశాలిచ్చారని... డైరెక్టర్ ఆపరేషన్ లేకుండా, ఉత్పత్తిని పెంచకుండా స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయాలనే ఏకైక లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

దీనికి నిరసనగా ఈ నెల 22న సీఎండీ కార్యాలయాన్ని కార్మికులతో కలిసి ముట్టడించి నిరసన తెలియజేస్తామన్నారు. సెప్టెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే 'రాస్తారోకో' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రజలంతా జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటకమిటీ రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి జరిగేలా చూడాలని, అదే కార్మిక సంఘాలు కూడా కోరుకుంటున్నాయని తెలిపారు. మీడియా సమావేశంలో వి.శ్రీనివాసరావు, దాసరి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడన ఢిల్లీ

న్యూఢిల్లీ: భారత్ 78వ స్వాతంత్ర్య దినోత్సవం దృష్ట్యా వేడుకల కోసం దేశ రాజధాని ఢిల్లీ ముస్తాబైంది. పంద్రాగస్టు కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మూడు వేల మంది ట్రాఫిక్ అధికారులు, 10వేల మందికిపైగా పోలీసులను మోహరించారు. 700 ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు కెమెరాలను ఢిల్లీ వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. అదనపు పోలీసు, పారామిలటరీ దళాలను మోహరించారు. ఐజీఐ ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, వ్యాపార సముదాయాలు, మార్కెట్లలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జమ్మూలో ఉగ్ర సంఘాల కదలికల దృష్ట్యా ఢిల్లీ/ పంజాబ్‌లో దాడులకు ఆస్కారం ఉండటంతో ఇంటెలిజెన్స్ సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఢిల్లీ హై అలర్ట్‌లో ఉంది. బాంబులను నిర్వీర్యం చేసే బృందాలు, జాగిలాలను రంగంలోకి దింపారు. ఎర్రకోట చుట్టూ భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. 'నో కైట్ ఫ్లైయింగ్ జోన్'గా ప్రకటించారు. ఈనెల 2 నుంచి 16వ తేదీ వరకు ఎర్ర కోట పరిసరాల్లో పారాగ్లైడర్లు, హాట్ ఎయిర్ బెలూన్లు, హాంగ్ గ్లైడర్లను నిషేధించారు. మెరుగైన భద్రత కోసం కృత్రిమ మేధతో పనిచేసే డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ (డీఎఫ్‌ఎండీ), సీసీటీవీ కెమెరాలనూ అంతటా ఏర్పాటు

చేశారు. వీటిని ముఖ గుర్తింపు వ్యవస్థతో అనుసంధానం చేసి వేడుకల్లో పాల్గొనే వారిపై నిఘా పెడతారు. బీఎస్‌ఎఫ్‌తో కలిసి యమునా తీరంలో ఢిల్లీ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ దూర్బిణితో నిఘా పెట్టారు. పంజాబ్‌కూడా హై అలర్ట్‌లో ఉంది. భటిండాలోని సున్నిత ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు అక్కడి ఎస్‌ఎస్‌పీ వెల్లడించారు. ఇదిలావుంటే, స్వాతంత్ర్య వేడుకలకు ఆరు వేల మంది ప్రత్యేక అతిథులు హాజరుకానున్నారు. వీరిలో యువత, గిరిజనులు, రైతులు, మహిళలతో సహా అన్ని వర్గాల వారుంటారు. ప్రభుత్వ పథకాల అమలుకు తోడ్పాటు అందించిన, అనేక రంగాల్లో సత్తా చాటుకున్న వారిని స్వాతంత్ర్య వేడుకలకు కేంద్రం ఆహ్వానించింది. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత బృందానికీ ఆహ్వానం అందింది.

అది సామూహిక అత్యాచారం

జూనియర్ వైద్యురాలి ఘటనపై డా.గోస్వామి వెల్లడి

కోల్‌కతా: ఆర్ జీ కార్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. అయితే ఈ ఘటనపై డాక్టర్ సువర్ణ గోస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రెయినీ వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరిగిందని వెల్లడిం చారు. బుధవారం మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో డాక్టర్ సువర్ణ గోస్వామి మాట్లాడుతూ... ఆమె శరీరంలో 151 గ్రాముల ద్రవ పదార్థం ఉందన్నారు. ఒక్కరే లైంగిక దాడికి పాల్పడితే... అంత ద్రవ పదార్థం ఆమె శరీరంలో ఉండదని తెలిపారు. అందువల్ల ఆమెపై కచ్చితంగా సామూహిక అత్యాచారం జరిగినట్లు స్పష్టమవు తుందని తెలిపారు. ఈ హత్యాచార ఘటనలో ఇంకా కొంతమంది ప్రమేయం ఉందని అభిప్రాయప డ్డారు. ఇదే విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులు సైతం స్పష్టం చేశారని డాక్టర్ గోస్వామి గుర్తు చేశారు. అలాగే ఆమె శరీరంపై గాయాలు సైతం ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్క వ్యక్తి మాత్రమే అయితే... ఆమెను అంతలా గాయం చేసే అవకాశాలు తక్కువని స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటికే సంజయ్ రాయ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, జూనియర్ వైద్యురాలి పోస్టుమార్టం నివేదికలో అనేక అంశాలు వెలుగుచూశాయి. వైద్యురాలి గొంతు కోసి హత్య చేశారు. దాంతో ఆమె థైరాయిడ్ భాగంలోని మృదులాస్థి విరిగిపోయింది. ఆమె మృతదేహంలోని ప్రైవేట్ భాగాల్లో సైతం గాయాలు స్పష్టంగా కనిపించాయి. పెదవులు, వేళ్లు, ఎడమ కాలు పైభాగంలో గాయాలు గుర్తించారు. ఆమె కళ్లతోపాటు నోటి నుంచి రక్తం కారిన విషయాన్ని నివేదికలో స్పష్టం చేసింది. లైంగిక దాడి జరిగినప్పుడు బిగ్గరగా అరవకుండా... ఆమె నోటిని గట్టిగా బిగించారు.

దీంతో ఆమె ఊపిరాడని పరిస్థితిలోకి వెళ్లారు. ఆమె తల భాగాన్ని గోడకు కొట్టినట్లుగా ఈ నివేదికలో స్పష్టమైంది. ముఖంపై గీతలు కనిపించాయి. లైంగిక దాడి చేసే క్రమంలో ఆమెను తీవ్రంగా హింసించినట్లు పోస్ట్‌మార్టం నివేదిక వెల్లడించింది.

ప్రాజెక్టుల భద్రతపై నీలినీడలు!

(మూడోపేజీ తరువాయి)

పూర్తయింది. పురాతన ప్రాజెక్టులకు ఎప్పటికప్పుడూ మరమ్మతులు చేసుకుంటూ పోవాలి. తుంగభద్ర డ్యామ్‌లో 19వ క్రస్ట్ గేట్ చైన్‌లింక్ తెగి గేట్ కొట్టుకుపోవడం వల్ల డ్యామ్ నుంచి దాదాపు 90వేల క్యూసెక్కుల నీరు అనివార్యంగా దిగువకు పోతోంది. దీని ప్రభావంతో వరదముప్పు రావడమే కాకుండా, ఆయకట్టుకు ఈ ఏడాది ఖరీఫ్, రబీకి నీటి సరఫరా పూర్తి స్థాయిలో అందేపరిస్థితి లేదు. అందువల్ల నీటిని పూర్తిగా కిందికి వదలకుండా తక్షణ మరమ్మతులు చేసి, డ్యామ్‌లో నీటి నిల్వ చేయాల్సి ఉంది. మన రాష్ట్రంలోని మిగిలిన భారీ, మధ్యతరహా డ్యామ్‌ల భద్రత ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి సవాల్‌గా మారింది.

ప్రాజెక్టుల గేట్లు ధ్వంసమైనప్పుడల్లా వాటి మరమ్మతుల కోసం లక్షలాది క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయాల్సిన పరిస్థితి అనివార్యమౌతోంది. డ్యామ్‌లకు ప్రమాదాలు ఏర్పడినప్పుడు, గేట్లు ధ్వంసమైనప్పుడు మాత్రమే ప్రభుత్వాలు అప్రమత్తమవుతున్నాయి. ఆ సమయంలో అరకొరగా నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటాయి. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రాజెక్టుల భవితవ్యంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేరుకు ఇరిగేషన్ రంగానికి నిధులు కేటాయించినప్పటికీ, వాటిని అరకొరగా వినియోగించి, మిగిలిన నిధులను పక్కకు దారి మళ్లించడం మన పాలకులకు ఆనవాయితీగా మారింది. గత ప్రభుత్వాల హయాంలో సక్రమంగా ప్రాజెక్టుల మరమ్మతులపై దృష్టి పెట్టకపోవడంతోనే పదేపదే భారీ వర్షాలు, వరదలు వచ్చిన సందర్భాల్లో ఈ రకమైన ప్రమాదాలను చవిచూడాల్సి వస్తోంది. పులిచింతల, గుండ్లకమ్మ తదితర ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయినప్పటికీ, వాటికి మరమ్మతులు సకాలంలో జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో పులిచింతల ప్రాజెక్టులో 16వ నంబరు గేట్ కొట్టుకుపోయింది. వరద నీటి కోసం గేటు ఎత్తుతుండగా ఒక్కసారిగా ధ్వంసమైంది. అప్పుడు కూడా నీటి ఒత్తిడి తగ్గాకనే మరమ్మతులు చేపట్టారు. ఆ సమయంలో పులిచింతలకు చెందిన 11 గేట్లను ఎత్తివేసి, రెండు లక్షల 90వేలకుపైగా క్యూసెక్కుల నీటిని సముద్రం పాల్జేశారు. ప్రకాశంజిల్లా గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లూ ధ్వంసమయ్యాయి. దాదాపు 80వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందాల్సి ఉంది. మొదటగా ఈ ప్రాజెక్టు మూడో నంబరు గేటు కొట్టుకుపోయింది. దానిని పునరుద్ధరించక ముందే... ఈ ప్రాజెక్టుకు చెందిన రెండో నంబరు గేట్ కూడా ధ్వంసమైంది. దీంతో ప్రాజెక్టు నుంచి నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లిపోయింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్రాజెక్టుకు ఈ దుస్థితి పట్టిందని, నీటి నిల్వకు అవసరమైన చర్యలు చేపట్టడంలో నాటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు హల్‌చల్ చేశాయి. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో పోరాట కమిటీగా ఏర్పడి, వివిధ దశల్లో ఆందోళన నిర్వహించారు. ఫలితంగా ప్రస్తుతం గుండ్లకమ్మ గేట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆ పనులను వేగవంతం చేయాల్సిన బాధ్యత ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉంది.

గతంలో కురిసిన భారీ వర్షాలు, వదరల ప్రభావంతో ఉమ్మడి కడప జిల్లాల్లోని అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు రెండూ కొట్టుకుపోయాయి. ప్రాణ నష్టంతోపాటు ఆర్థిక నష్టం సంభవించింది. గ్రామాలు నీట మునిగగా, పంటలు కొట్టుకుపోయాయి. నెల్లూరుజిల్లా సోమశిల ప్రాజెక్టు యాప్రాన్ ధ్వంసమైంది. సకాలంలో ఆయా ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టి ఉంటే, ఈ పెనుప్రమాదం తప్పి ఉండేది. ప్రభుత్వ నిర్వహణలోపంతోనే సోమశిల యాప్రాన్‌కు గండిపడింది. నాడు ఇరిగేషన్ రంగ అధికారులు ముందస్తు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటే ప్రాజెక్టులు కొట్టుకుపోయేవికాదు. అలాగే సోమశిల యాప్రాన్ కూడా కొట్టుకుపోయేది కాదు. అటు గోదావరి వరదల ఉధృతితో పోలవరం డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైంది. పోలవరం నిర్మాణంలో డయాఫ్రమ్ వాల్ కీలకంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం సకాలంలో నిధులు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టు నిర్మాణంలో సరైన శ్రద్ధ చూపి ఉంటే... ఈ పరిస్థితి వచ్చి ఉత్పన్నమయ్యేది కాదు. అదే విధంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల దిగువ భాగంలో పెద్దపెద్ద గుంతలు పడి ప్రాజెక్టుల ఉనికికే ప్రమాదాలు ఏర్పడే సూచనలున్నాయని నిపుణులు సూచిస్తున్నప్పటికీ, ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. డ్యామ్‌ల గేట్లు కొట్టుకుపోతున్న సంఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. ప్రస్తుతమున్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల భద్రతకు చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టులకు లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించడమే కాకుండా, వాటి మరమ్మతులకు ఎప్పటికప్పుడూ దృష్టి సారించకుంటే ఇలాంటి ప్రమాదాల్ని భవిష్యత్‌లో మరిన్ని చూడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.మరమ్మతులపై అశ్రద్ధ వహిస్తే, ప్రాజెక్టుల భవితవ్యమే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి ఉంటుంది. గత ప్రభుత్వ తప్పిదాలను కూటమి ప్రభుత్వం దూరదృష్టితో వ్యవహరించి, ప్రాజెక్టుల భవితవ్యంపై ఎలాంటి అనుమానాలు తలెత్తకుండా పూర్తిస్థాయిలో మరమ్మతులకు నిధులు విడుదల చేసి, నీటి నిల్వకు అవసరమైన సమగ్ర ప్రణాళికతో ముందుకు పోవాల్సిన అవసరముంది.

సెబీ అక్రమాలపై ఆందోళన

(మూడోపేజీ తరువాయి)

ముంపును జాతీయ విపత్తుగా ప్రకటిస్తే ఆ ప్రాంతానికి సహాయం అందుతుందన్నారు. వయనాడ్ విలయంలో సీపీఐ ముఖ్య నాయకులు, కార్యకర్తలు 45 మంది మృతి చెందారని, వారి కుటుంబాలకు ఇళ్లు నిర్మించడానికి పార్టీ కృషి చేస్తుందన్నారు. దేశంలో గవర్నర్ల వ్యవస్థ దారుణంగా మారిందని నారాయణ విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఒకపేరు చెబితే...లెఫ్టినెంట్ గవర్నరు మరోపేరు సిఫార్సు చేశారని మండిపడ్డారు. ప్రజలచేత ఎన్నికకాబడిన నాయకులను కాదని వేరేవారిని సూచించటం ప్రజాస్వామ్యం ఎలా అవుతుందన్నారు. ఎన్నికలు ఎందుకు పెడుతున్నారని ఘాటుగా విమర్శించారు.

అగ్రిగోల్డ్ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పు చేశారని నారాయణ అన్నారు. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీపీఐ తరపున మాట్లాడామని, అగ్రిగోల్డ్ వద్ద రూ.21 వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకుని డిపాజిట్‌దారులకు న్యాయం చేయాలని కోరినట్లు గుర్తుచేశారు. ఆయనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు భావించి ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో డిపాజిట్‌దారులకు అన్యాయం జరిగిందన్నారు.

మాజీ మంత్రి జోగి రమేశ్ వ్యవహారం తాజాగా బయటకు వచ్చిందని, ముందు ముందు మరిన్ని వెలుగు చూస్తాయోనన్నారు. ప్రపంచ మేధావిగా కీర్తి గడించిన అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయటాన్ని నారాయణ ఖండించారు. నెమలి నాట్యం చేస్తుంటే ఎలుక వెక్కిరించిన చందంగా జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహారం ఉందన్నారు. అంబేద్కర్ పేరుతో సమానంగా జగన్ పేరు ఉండటం సమర్థనీయం కాదన్నారు.

ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులివ్వాలి: రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రైతులకు పంటల బీమా కింద ప్రీమియం చెల్లించకపోవటంతో పంట నష్టపోయిన రైతులకు ఎలాంటి లబ్ధి చేకూరటం లేదన్నారు. రాయలసీమలో ఆరు జిల్లాలు, ప్రకాశం జిల్లా వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు పంట నష్టపోయారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రూ.20 వేలు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు అంటే కేవలం పోలవరం మాత్రమే అన్నట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. తుంగభద్ర డ్యామ్‌లో గేటు కొట్టుకుపోయిన ఘటనలో ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. కర్నాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ తుంగభద్ర డ్యామ్‌ను పరిశీలించారని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం అంత వేగంగా స్పందించలేదన్నారు. తుంగభద్ర డ్యామ్‌లో నీళ్లు లేకపోతే కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రజలకు తాగునీరు కూడా ఉండదన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయి 40 మంది చనిపోయారని, కొన్ని గ్రామాలు దెబ్బతిన్నాయని గుర్తుచేశారు. పింఛా ప్రాజెక్టు కూడా దెబ్బతిందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయమై ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రాజెక్టుల సమగ్ర నిర్వహణ కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సూచించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం

(మూడోపేజీ తరువాయి)

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు వినిపించేందుకు ఇరుపక్షాల న్యాయవాదులు సిద్ధమైన క్రమంలో విచారణ నుంచి తాను తప్పుకుంటున్నట్లు సీనియర్ న్యాయమూర్తి, జస్టిస్ సంజీవ్ ఖన్నాకు జస్టిస్ సంజీవ్ కుమార్ చెప్పారు. దీంతో వచ్చే నెలలో జస్టిస్ సంజీవ్ కుమార్ లేని ధర్మాసనం ముందు పిటిషన్‌ను లిస్ట్ చేయాలంటూ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశించారు.

ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై

రంగంలోకి సీబీఐ

కోల్‌కతా: దేశవ్యాప్తంగా కలకలం రేపిన కోల్‌కతా ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసును హైకోర్టు ఆదేశాలతో సీబీఐకి అప్పగించడంతో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. సీబీఐ, ఎఫ్ఎస్ఎల్ బృందాలు బుధవారం మధ్యాహ్నం వైద్యురాలి హత్యాచార ఘటన చోటుచేసుకున్న ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి చేరుకున్నాయి. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టింది. దర్యాప్తు బాధ్యతను స్వీకరించిన వెంటే సీబీఐ ఢిల్లీ నుంచి ప్రత్యేక వైద్య, ఫోరెన్సిక్ బృందాన్ని ఘటనా ప్రాంతానికి పంపింది. ఇక కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసు దేశ వ్యాప్తంగా పెనుదుమారం రేపుతోంది. ఈ కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఘటన జరిగి ఐదు రోజులు అయినప్పటికీ... దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని పేర్కొంది. కేసు డైరీని,ఇతర డాక్యుమెంట్లను సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది.

ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పందించారు. నిర్భయ ఘటన అనంతరం కఠిన చట్టాలు తీసుకురావడంతో పరిస్థితి మెరుగుపడుతుందని అనిపించినా... కథువా, ఉన్నావ్, హత్రాస్, లలిత్ పూర్ వంటి ఘటనలు దిగ్భ్రాంతి కలిగించాయని, దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు వెలుగుచూడటం విచారకరమని అన్నారు. కోల్‌కతా ఘటన దారుణ ఉదంతమని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్లు ప్రజలను ఆరోగ్యంగా ఉండేలా శ్రమిస్తుంటే మనం వారి భద్రతను కాపాడలేకపోతున్నామని వ్యాఖ్యానించారు.

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి: సీఎస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 వసంతాలు పూర్తయిన సందర్భంగా ప్రతి ఇంటిపై ప్రజలు మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగపై బుధవారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి, విజయ వంతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఇంటిపై ప్రజలు జాతీయ జెండా ఎగురవేసేలా చూడాలన్నారు.

దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు జాతీయ జెండా ప్రాముఖ్యతను తెలియజేసి ప్రజల్లో చైతన్యాన్ని నింపేందుకుగాను ఊరూవాడా హర్ ఘర్ తిరంగా ప్రదర్శనలు నిర్వహించడంతోపాటు విజయవంతానికి కలెక్టర్లు కీలక భూమిక పోషించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించాలని అన్నారు. ప్రజల్లో దేశభక్తి భావాలను పొందించే రీతిలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. జాతీయ జెండాతో ఉన్న సెల్ఫీ ఫోటోలు, వీడియోలను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా హర్‌ఘర్ తిరంగ్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కాన్వాస్‌పై నీరబ్ కుమార్‌ప్రసాద్ సంతకం చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి వినయ్‌చంద్, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

రామచంద్రరావు ఆదర్శనీయుడు

సంస్మరణ సభలో నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్యాలయ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన డీఎస్.రామచంద్రరావు ఆదర్శనీయులని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. విజయవాడ, దాసరి భవన్‌లో సీపీఐ ఆంధ్రప్రదేశ్ కార్యాలయ కార్యదర్శి వై.చెంచయ్య అధ్యక్షతన బుధవారం రామచంద్రరావు సంస్మరణ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నారాయణ నివాళు లర్పించారు. రామచంద్రరావు తన కుటుంబం కంటే పార్టీకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మంచి రచయిత, మేధావి, కార్యాలయ కార్యదర్శికి ఉండాల్సిన అన్ని లక్షణాలున్న వ్యక్తి అని కొనియాడారు. రామచంద్రరావుతో ఒక్కసారి మాట్లాడిన వారు ఆయనను మర్చిపోలేరని చెప్పారు. తుది వరకు కమ్యూనిస్టు పార్టీ రామచంద్రరావుకు అండగా ఉందని నారాయణ అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ చండ్ర రాజేశ్వరరావు, దాసరి నాగభూషణరావు, సురవరం సుధాకర్‌రెడ్డి, నారాయణ వంటి అగ్రనాయకులతో రామచంద్రరావుకు సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఆయనను నీలం రాజశేఖర్‌రెడ్డి సీపీఐ కార్యాలయానికి తీసుకువచ్చారన్నారు. రామచంద్రరావు కార్యకర్తలనూ ఆప్యాయంగా పలకరించే వారని రామకృష్ణ చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రామచంద్రరావు మధుస్వభావి, నిబద్ధత కలిగిన వ్యక్తి అని అన్నారు. పార్టీ నాయకులకు వైద్యం అవసరమైనప్పుడు హైదరాబాద్ వైద్యులతో మాట్లాడి

తన వంతు సహకారాన్ని అందించేవారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్ మాట్లాడుతూ 1974లో సీపీఐ 10వ జాతీయ మహాసభలో రామచంద్రరావు తనకు పరిచయం అయినట్లు చెప్పారు. పార్టీ కార్యాలయానికి ఎవరు వచ్చినా గౌరవంగా చూసే వారిని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు మాట్లాడుతూ రామచంద్రరావుకు ఆంగ్ల భాషపై మంచి ఉండేదని, పార్టీ కార్యక్రమాలపై స్పష్టతతో వ్యవహరించే వారన్నారు. సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు క్రమశిక్షణకు నిలువుటద్దం రామచంద్రరావు అని కొనియాడారు. జవాబుదారీతనం, సమయపాలనలో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తారని, కమ్యూనిస్టు ఉద్యమాలకు వారధి వంటివారని శ్లాఘించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు జి.ఈశ్వరయ్య, సీహెచ్. కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్, ఆర్.రవీంద్రనాథ్, ఎస్.వెంకట సుబ్బయ్య, పరుచూరి రాజేంద్రబాబు, ఎన్.లెనిన్ బాబు, వి.జాన్సన్ బాబు, కె.శివారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి యడ్ల కృష్ణ కిషోర్, పి దుర్గాంబ, కొల్లి టాన్య, సమత, కె శ్రీనివాసరావు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, ఏఐవైఎఫ్ నాయకుడు లంకా గోవిందరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయికుమార్, కె.కార్తీక్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, నేత షేక్.నజీర్ విప్లవ గీతాలు ఆలపించారు.

ధాన్యం సొమ్ముకోసం రైతుల ధర్నా

విశాలాంధ్ర- ఏలూరు: దళారుల చేతిలో మోసపోయిన రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల అధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద బాధిత రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. జమలయ్య మాట్లాడుతూ 2023 డిసెంబరు నుంచి 2024 ఫిబ్రవరి వరకు రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయపోవడంతో దళారులకు అమ్మి మోసపోయారని తెలిపారు. నూజివీడు మండలం సుంకొల్లు, పడమట దిగవల్లి, అన్నవరం, సూరేపల్లి, ముక్కొల్లు పాడు, చాట్రాయి గ్రామాలకు చెందిన 116 మంది రైతులు అన్నవరం గ్రామానికి చెందిన మల్లూరు వెంకట నాగచంద్రశేఖర్, అతడి సోదరుడు సురేశ్‌కు ధాన్యం విక్రయించి మోసపోయారని వివరించారు. మే 25న నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్లో 65 మంది ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంత్రి కొలుసు పార్థసారథికి... సమస్య పరిష్కారం చేయాలని కోరుతూ రైతులు విజ్ఞాపన పత్రం అందజేసే క్రమంలో ... అక్కడ ఉన్న పోలీసులు మంత్రిని పక్కదారి

పట్టించేలా వ్యవహరించడం దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళారులు ఐపీ పిటిషన్ దాఖలు చేశారని పోలీసులు చెబుతున్నారని, కానీ ఐపీ పిటిషన్ దాఖలుకు ముందే ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయని పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ మాట్లాడుతూ దళారులను మంత్రి, పోలీసులు రక్షించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సుమారు రూ.కోటి విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసి పరారైన దళారులపై కేసు నమోదు చేయండని స్టేషన్‌కు వెళితే... కేసు నమోదు చేయకపోగా అవహేళనగా మాట్లాడటం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించే ఏర్పాటు చేయాలని, రైతులను అవహేళన చేసిన పోలీసులుపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా నాయకుడు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారుల చేతిలో మోసపోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులను కేసు నుంచి తప్పించే విధంగా పోలీసు యంత్రాంగం వ్యవహరిస్తుందని విమర్శించారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎస్పీలకు వినతి పత్రాలు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, గంగుల గిరీష్ బాబు, కస్తూరి శ్రీనివాసరావు, పెద్దలంక వీర వెంకయ్య, కంచర్ల నాగరాజు, మందపాటి రంగారావు, కలవల వెంకటేశ్వర రావు, నల్లి బోయిన నాగరాజు, కొణతాల అప్పారావు, పామర్తి ఏడుకొండలు పాల్గొన్నారు.

వయనాడ్ విపత్తు బాధితులకు

విశాలాంధ్ర సిబ్బంది రూ. లక్ష విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకృతి ప్రకోపానికి గురైన కేరళలోని వయనాడ్ జిల్లాలో బాధితులకు తమ వంతు చేయూతగా విశాలాంధ్ర సంస్థల సిబ్బంది లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. వయనాడ్ ప్రాంతంలోని మహిళలు కట్టుకునేందుకు బట్టలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి తమ వంతు సాయాన్ని అందించాలన్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచన మేరకు విశాలాంధ్ర ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం సాయంగా ప్రకటించారు. ఈ మేరకు లక్ష రూపాయలను బుధవారం విశాలాంధ్ర కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి కె. రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథరెడ్డికి విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మోదుమూడి మురళీకృష్ణ, సీపీఐ శాఖ కార్యదర్శి పత్తిపాటి మధుసూదనరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్, పార్టీ శాఖ నాయకులు చావా రవి, ఎ. సురేష్‌బాబు, మండేల రామారావు, కె. వెంకటస్వామి, బి. మీనా, ఈడ్పుగంటి రొమిలా పాల్గొన్నారు. ఒక రోజు వేతనం విరాళంగా అందజేసిన విశాలాంధ్ర ఉద్యోగులకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి. హరినాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ బలంతోనే టీడీపీ వెనక్కి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తమ పార్టీ బలాన్ని చూసే ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీ వెనక్కి తగ్గిందని వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. తమ పాలనలో ప్రజలకు చేసిన మంచి ఎక్కడికీ పోలేదని, రాష్ట్ర ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. యలమంచిలి, భీమిలి నియోజకవర్గాల జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో జగన్ బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. జగన్ మాట్లాడుతూ ప్రలోభాలకు గురికాకుండా మీరంతా ఒక్కటిగా ఉండటంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు వెనక్కి తగ్గారన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నట్లుగా చిత్రీకరిస్తున్నారని చంద్రబాబు పాలనను విమర్శించారు.

17 నుంచి 'తెలుగు సరిగమప' ఆడిషన్స్

విశాలాంధ్ర-కడప: విజయవంతంగా 15 సీజన్లు పూర్తి చూసుకున్న జీ తెలుగు 'సరిగమప సీజన్ 16- ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్'ను ప్రారంభించడానికి సిద్ధమవు తోందని సంస్థ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆడిషన్స్ నిర్వహి స్తోందన్నారు. ప్రతిభను ప్రోత్సహిస్తూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేందుకు శని, ఆదివారాల్లో నెల్లూరు, తిరుపతి, కర్నూల్‌లో ఆడిషన్లను నిర్వహిస్తోందన్నారు. 15-30 సంవత్సరాల వయస్సుగల గాయనీగాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెల్లూరులో ఈ నెల 17న హోటల్ యశ్ పార్క్, 18న తిరుపతిలోని రేస్ ఇన్స్టిట్యూట్, 19న కర్నూల్లోని సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కాలేజీ నందు ఆడిషన్స్ జరగనున్నాయన్నారు. వివరాల కోసం 9154670067 సంప్రదించాలన్నారు. ఔత్సాహికులు ఈ నెల 30 వరకు డిజిటల్ ఆడిషన్స్ ద్వారా కూడా ఈ అవకా శాన్ని అందిపుచ్చుకోవచ్చన్నారు. పాట పాడిన తమ వీడియో లను 9154670067 నెంబర్‌కు వాట్సాప్ లేదా ztsaregamapa@zee.com ఇమెయిల్ ద్వారా పంపవచ్చన్నారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.